నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శనివారం
5 ఏప్రిల్
2025
పేజీలు 8

గుంటూరు పల్నాడు

# వసతులు ఫుల్ - రేడియాలజిస్ట్ నిల్




- సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో సమస్యలు కోకోల్లలు
- సంవత్సరాలుగా కంటికి కనిపించని రేడియాలజిస్ట్
- ఇబ్బందులు పడుతున్న రోగులు, వైద్యులు

**సత్తెనపల్లిలో 100 పడకల ఆసుపత్రిగా రూపాందిన ప్రభుత్వ వైద్యశాలలో రేడియాలజిస్ట్ లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వసతులు కల్పించి కీలకమైన రేడియాలజీ విభాగంలో వైద్యుడిని నిర్మించకపోవడంతో సర్కారుపై పలువురు విమర్శలు చేస్తున్నారు. ముఖ్యమైన ఈ భాగంలో వైద్యుడిని నియమించాలని అధికారులు భావించకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు ఏళ్ల తరబడి రేడియాలజీ భాగంలో డాక్టర్ కనిపించడం లేదని ప్రజలు, ఈ ఆసుపత్రికి వచ్చే రోగులు విమర్శిస్తున్నారు. వైద్య పరీక్షల నిమిత్తం ఈ ఆసుపత్రికి వచ్చే గర్భిణీ స్త్రీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్కానింగ్, ఇతర పరీక్షలు చేయాలంటే బయట. లేబరేటరీలకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి తక్షణమే ఇక్కడ రేడియాలజీ వైద్యుల్ని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తించాలి.....**

**- సత్తెనపల్లి మేజర్ న్యూస్**

రోగికి చికిత్స చేయాలంటే రోగ నిర్ధారణ చాలా ముఖ్యం. మనిషి లోపల అంతర్భాగాలు పనితీరు తెలవాలన్న, ఆయా భాగాల్లో ఉన్న సమస్యలు చూడాలన్న రేడియాలజీ అనేది చాలా ముఖ్యం,అవసరం. ఎక్కడ సమస్య ఉందో తెలిస్తే కానీ డాక్టర్ రోగాన్ని నిర్ధారించలేరు. అవయవాల పనితీరును సక్రమంగా ఉందో లేదో తెలవాలంటే స్కానింగ్ చేయాల్సిందే, రేడియాలజిస్ట్ నిర్ధారణ చేయాల్సిందే. అప్పుడు మాత్రమే డాక్టర్ ఏ మందులు వాడాలో చెప్పగలరు. అంత



ప్రాముఖ్యత ఉన్న రెడియాలజీ డిపార్ట్మెంట్ కి సంవత్సరాలు తరబడి రేడియాలజిస్ట్ లేడు. అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని అన్న తీరుగా మారింది సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి స్థితి. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలలో పిండం యొక్క ఎదుగుదల సమస్యలు తెలుసుకోవాలంటే ఆల్ట్రా స్కానింగ్ చేయాల్సిందే. గత ప్రభుత్వంలో కూడా ఈ సమస్య పట్టి పీడించింది. ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన ప్రభుత్వ ఆసుపత్రికి రేడియాలజిస్ట్ అందుబాటులో లేకుండా ఉండటం మాత్రం మారలేదు. ప్రతినిత్యం అనేకమంది పేద ప్రజలు కొన్ని రకాల టెస్టుల కోసం బయటకు వెళ్లాల్సిన దుస్థితి. అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నప్పటికీ రేడియాలజిస్ట్ లేకపోవడం రోగులకు చాలా ఇబ్బందిరం. ఇప్పటికైనా సత్తనపల్లి ప్రభుత్వాసుపత్రి కి ఒక రేడియాలజిస్టును సమకూర్చాలని పేద ప్రజలు రోగులు కోరుకుంటున్నారు. ఈ విషయంపై సూర్య ప్రతినిధి సూపర్డెంట్ డాక్టర్ లక్ష్మణ్ రావు అని అడగగా ఈ విషయాన్ని అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లామన్నారు. అయినప్పటికీ రేడియాలజిస్టులు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయుటకు ఆసక్తి చూపటం లేదని, అందువల్లే బిడ్డింగ్ పిలిచినప్పటికీ దొరకని పరిస్థితి ఎదుర్కొంటున్నామన్నారు. ఏ హాస్పిటల్ కి అయినా రేడియాలజిస్ట్ చాలా ముఖ్యమని చాలా రకాల పరీక్షలు చేయటానికి చేసిన పరీక్షలను ధ్రువీకరించడానికి రేడియాలజిస్ట్ తప్పనిసరన్నారు.



# దళారుల రాజ్యంలో బ్రతుకులు ఛిద్రం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

మధ్య తరగతికి కుటుంబాలపై ధరల భారం పడి ఆర్థికంగా చిక్కి శల్య మవుతున్నాయి. ఉపాధి లేక నెలవారీ ఖర్చులు పెరిగిపోయి ఆర్థిక ఊబిలో కూరుకు పోతున్నాయి. రేయింబవళ్ళు కష్టపడినా అతని తల రాత మాత్రం మారడం లేదు . అప్పుల భారంతో కుంగిపోతున్న కుటుంబాలు కోకొల్లలుగా బ్రతుకు భారంగా మారటంతో ఉన్న ఆస్తులు అమ్మేసి కొంతమంది పడుతున్నారే తప్ప పొదుపు ఊసేలేదు. నిత్యావసర వస్తువుల ధరలువంట సలసల కాగు తున్నాయి. ఏ కుటుంబాన్ని కదిపినా అప్పుల చిట్టానే కనబడుతున్నది. పెరిగిన ధరలతో గ్యాస్ బండ మో యలేకపోతున్నారు. ఆదివారం చికెన్‌కు స్వస్తి పలికారు. బియ్యం ధరలు దిగిరాలేదు. పెట్రోలు, డీజిల్ భగ్గుముంటున్నాయి.. ఒకప్పుడు ధరలు నియంత్రణలో ఉండేవి. పప్పుల నుంచి నూనెల ధరల వరకు అంతా కట్టడి చేసేవారు. మూడేళ్ళుగా పరిస్థితి తల్లకిందులైంది. వ్యాపా రులది ఇష్టారాజ్యంగా మారింది. నిలకడలేని ధరలు తారస్థాయికి పెరిగినా సర్కారుకు పట్టడం లేదు. చిన్నాచితక కుటుంబాలు ఇప్పటికే చితికిపోయాయి. పెరిగిన ధరలతో ఇంటిని సాకలేక యజమానులు అప్పులపాలయ్యారు. సాధార ణంగా నిత్యావసర వస్తువులు పెరుగుతున్నాయంటే ఇంతకుముందు ప్రభుత్వం అప్రమత్తమయ్యేది. తక్షణం **మిగతా 3వ పేజీలో**

## మధ్యతరగతి అధోగతి....!

- బ్రతుకుతెరువు కోసం చిన్న కుటుంబాల ఆరాటం
- అదుపుతప్పిన నిఘా, నియంత్రణ
- మార్కెట్‌ను గాలికొదిలేశారు
- వ్యాపారులదే ఇష్టారాజ్యం
- దూరదృష్టి లేని సర్కార్

# అక్రమ నాటు సారా అమ్మకంపై దాడి..!

- గుండ్లపాడులో భారీగా నాటుసారా సీజ్, ఒకరు అరెస్ట్..!
- సుమారు 61 లీటర్ల నాటు సారా స్వాధీనం.
- నిందితుడిపై కేసు నమోదు.! రిమాండ్‌కు తరలింపు.!!

**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :** మాచర్ల ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ప్రొహిబిషన్ %ఃడ% ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మాచర్ల, గుంటూరు ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో వారి సిబ్బందితో కలిసి వెల్దుర్తి మండలంలోని గుండ్లపాడు గ్రామంలో అక్రమ మద్యం విక్రయంపై దాడులు నిర్వహించారు. రహస్య సమాచారం ఆధారంగా జరిగిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో మర్రిపూడి కాశయ్య (52) అనే వ్యక్తి వద్ద 2.25 లీటర్ల పరిమాణం గల 27 ప్లాస్టిక్ బాటిళ్లలో (మొత్తం 60.875 లీటర్లు) నిల్వ ఉంచిన నాటు సారాని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా, ఈ అక్రమ వ్యాపారంలో పాల్పడుతున్న కాశయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాచర్ల ప్రొహిబిషన్ %ఃడ% ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎన్. వెంకటరమణ మాట్లాడుతూ.. మాచర్ల పరిధిలో నాటు సారాయి వ్యాపారం, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తీసుకువచ్చే నాన్-డ్యూటీ పెయిడ్ లిక్కర్ విక్రయాన్ని పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని, ఇటువంటి **మిగతా 3వ పేజీలో**



## ఎమ్మెల్సీ ఆలపాటికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, మేజర్ న్యూస్ :** రాజకీయాల్లో విలువలు, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన మనసున్న మారాజు ఎమ్మెల్సీ ఆలపాటి రాజా అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజా పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ కలిసి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ విద్యాప్రదాతగా ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఆలపాటి నేటితరానికి ఆదర్శ రాజకీయ నాయకులని కొనియాడారు. కూటమి ఏర్పాటులో భాగంగా పదవులు ముఖ్యం కాదని, విలువలే ముఖ్యమని చాటిచెప్పిన త్యాగమూర్తి అని చెప్పారు. ఏ పదవి చేపట్టినా ఆ పదవులకు వన్నె తీసుకొస్తూ తనకంటూ ప్రత్యేక ప్రజాభిమానాన్ని పొందిన గొప్ప నేత అని చెప్పారు. ప్రజా సేవను ఒక బాధ్యతగా గుర్తించి జీవితాన్ని మలుచుకున్నారని తెలిపారు. అలాంటి ఆలపాటి రాజా నేటి తరం రాజకీయ నేతలను ఆదర్శప్రాయులని పేర్కొన్నారు. పుట్టిన రోజు సందర్భంగా మరిన్ని కాలాలు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

## ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ..!



**మాచర్ల ప్రతినిధి / రెంటచింతల న్యూస్ :** రెంటచింతల మండలం, మల్లవరం గ్రామంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ దైవిక కార్యక్రమానికి మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భూమి పూజ చేసి, ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి పార్టీ పెద్దలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పార్టీ నాయకులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెంటచింతల మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామసభలను రాజ్యాంగం, పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సక్రమంగా నిర్వహించాలి



**పెదకాకాని మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అన్ని గ్రామాలలో గ్రామ సభలను రాజ్యాంగం, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సక్రమంగా నిర్వహించాలని ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామసభలు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగం, గ్రామాభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఇది వేదికగా ఉంటుందని, ఇందులో భాగంగా, ఏప్రిల్ మాసంలో నిర్వహించబడే గ్రామసభలలో గ్రామస్థులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. ఈ సమావేశాల్లో పాల్గొనడం ద్వారా గ్రామంలోని అభివృద్ధి పనులపై ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించవచ్చు. గ్రామ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాలు, నిధుల వినియోగం వంటి కీలక అంశాలపై ప్రజల అవగాహన పెంచే అవకాశాన్ని గ్రామసభలు కల్పిస్తాయన్నారు.

# బర్డ్ ఫ్లూతో చనిపోయిన చిన్నారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలి



- భారతదేశంలో బర్డ్ ఫ్లూ తో చనిపోయిన రెండవ కేసు
- పల్నాడు జిల్లాను బర్డ్ ఫ్లూ ఇన్ఫెక్షన్ సెంటర్ గా డిక్లేర్ చేయాలి
- స్థానిక ఎమ్మెల్యే పాపకు బర్డ్ ఫ్లూ సోకలేదని చెప్పటం హాస్యాస్పదం
- నరసరావుపేటలో ప్రతి ఇంటికి సర్వేలైన్స్ కార్యక్రమం చేపట్టాలి

మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

**నరసరావుపేట మేజర్ న్యూస్ :** స్థానిక బాలయ్య నగర్ లో బర్డ్ ఫ్లూ వ్యాధితో చనిపోయిన రెండు సంవత్సరాల చిన్నారి కుటుంబాన్ని మాజీ శాసనసభ్యులు డాక్టర్ శ్రీ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి గారు పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రెండు సంవత్సరాల చిన్నారి బాలిక బర్డ్ ఫ్లూ తో చనిపోవటం బాధాకరమని, మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు అవయవాలు పనిచేయకపోవడం వల్ల బాలిక చనిపోయిందని నిర్ధారించడం జరిగింది. భారతదేశంలో మొట్టమొదట బర్డ్ ఫ్లూ తో చనిపోయిన మొదటి కేసు 2021 వ సంవత్సరంలో మహారాష్ట్రలో నమోదయింది ,తిరిగి రెండవ కేసు నరసరావుపేటలో నమోదు కావడం బాధాకరం, ఈ పాపకు బర్డ్ ఫ్లూ సోకిందనే విషయాన్ని భారతదేశంలోని అత్యంత ప్రతిష్టమాత్మక వైరాలజీ సంస్థ ఐ సి ఎం ఆర్ నిర్ధారించడం జరిగింది. ఇది సామాన్యమైన విషయం కాదు మన స్థానిక ఎమ్మెల్యే అరవింద్ బాబు గారు ఈ పాపకి సోకింది బర్డ్ ఫ్లూ కాదని చెప్పటం హాస్యాస్పదం అని, ఈయనకు ఏ విధంగాను అవగాహన లేదని స్పష్టమవుతుందన్నారు. బర్డ్ ఫ్లూ వ్యాధి రావడానికి అనేక కారణాలు ఉన్నాయని పచ్చి మాంసం తినటం, మరియు చనిపోయిన కోళ్లను తాకినా, పక్షుల నుంచి వచ్చిన లాలాజలం తాకినా, ఇతర ప్రదేశాల నుంచి వచ్చిన పక్షుల నుండి కూడా ఈ వ్యాధి సోకవచ్చని, కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం ఆరు జిల్లాలను బర్డ్ ఫ్లూ ఇన్ఫెక్షన్ సెంటర్లు గా డిక్లేర్ చేయడం జరిగిందని, తూర్పుగోదావరి పశ్చిమగోదావరి కాకినాడ ఏలూరు ఎన్టీఆర్ మరియు కర్నూలు జిల్లాలను బర్డ్ ఫ్లూ ఇన్ఫెక్షన్ సెంటర్ లుగా డిక్లేర్ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఒక బాలిక బర్డ్ ఫ్లూ వ్యాధితో చనిపోతే మరి పల్నాడు జిల్లాను బర్డ్ ఫ్లూ ఇన్ఫెక్షన్ సెంటర్ గా ఎందుకు డిక్లేర్ చేయలేదని ఈ ప్రభుత్వాన్ని నేను ప్రశ్నిస్తున్నాను, ఈ ఏరియాలో 10 కోళ్లు కూడా బర్డ్ ఫ్లూ వ్యాధితో చనిపోయారని చెబుతున్నారని, దీని మీద కూడా విచారణ చేయాలని,గతంలో కోవిడ్ సమయంలో వాలంటీర్లు ప్రతి ఇంటికి సర్వే లైన్స్ నిర్వహించి ఏ ఇంట్లో జ్వరం ఉన్న, ఏ వ్యాధి ఉన్న వారిని వెంటనే చికిత్స పొందే ఏర్పాటు చేయడం జరిగింది. ఈరోజు ఆ వ్యవస్థ లేదు సర్వేలైన్స్ కార్యక్రమం చేసే దిక్కులేదు, మెడికల్ అండ్ హెల్త్ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారు, మందులు లేవు ,డాక్టర్లు లేరు వైద్యం అందడం లేదు, ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు నడిచే పరిస్థితి లేదు ,ఆరోగ్యశ్రీ నిధులు 3500 కోట్లు ఈ ప్రభుత్వం బకాయి పెట్టింది ,ప్రైవేట్ ఆస్పత్రులు ఏప్రిల్ ఏడవ తేదీ నుంచి ఆరోగ్యశ్రీ సేవలను బంద్ చేస్తామని డిక్లేర్ చేశారు, ఈ రాష్ట్రంలో పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఒక వ్యక్తి బర్డ్ ఫ్లూ వ్యాధితో చనిపోతే ఆరోగ్య శాఖ మంత్రి ఏం చేస్తున్నాడని, ప్రిన్సిపల్ సెక్రెటరీ గాని ఆరోగ్య శాఖ మంత్రి గాని నరసరావుపేటకు వచ్చి కనీసం ఈ కుటుంబాన్ని పరామర్శించలేదని ప్రశ్నించారు, ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం అని, ఈ కుటుంబానికి తక్షణమే ప్రభుత్వం ఎక్స్ గ్రేషియో ప్రకటించాలని ,ఈ నిరుపేద కుటుంబానికి న్యాయం చేయాలని, మంత్రి నరసరావుపేటకు రావాలని, వాస్తవాలు విచారణ చేసి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మారూరి శివారెడ్డి ,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా డాక్టర్స్ వింగ్ అధ్యక్షులు డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , డాక్టర్ పల్లకి వేణుగోపాల్ రెడ్డి , ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు , జడ్పిటిసి పదముత్తం చిట్టి బాబు , యన్నం రాధాకృష్ణ రెడ్డి , మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి , మూరె రవీంద్రారెడ్డి , ట్రావెల్స్ తిరుపతి రెడ్డి తదితర వైఎస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా దుర్గి మండలంలో గ్రామ సభలు నిర్వహణ



**దుర్గి, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా మాచర్ల ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని దుర్గి మండలంలో నవోదయం 2.0 కార్యక్రమం కింద గ్రామ సభలు నిర్వహించబడ్డాయి. ఈ గ్రామ సభలు ఏ–కేటగిరి గ్రామమైన నెహ్రూ నగర్ తండా మరియు బి–కేటగిరి గ్రామమైన ఓబులేసునిపల్లెలో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ ఆఫీసర్ కె. మణికంఠ, దుర్గి మండల ఎమ్.పి.పి సునీత సాయిశంకర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శివప్రసాద్, తహసీల్దార్ ఫణీంద్ర కుమార్, పోలీసులు, అటవీశాఖ అధికారులు, గ్రామ అధ్యక్షులు, పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సారాయి సేవించడం ఆరోగ్యానికి హానికరం అని, ప్రజలు సారాయి నుంచి దూరంగా ఉండాలని సూచించారు. సారాయి సంబంధిత నేరాలలో నిమగ్నమయ్యే వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. యువత చెడు మార్గాన్ని విడిచి విద్య, ఉద్యోగాల దిశగా కృషి చేయాలని సూచించారు.సారాయి వినియోగం, తయారీ, రవాణా, నిల్వ మరియు అమ్మకాలు చట్టరీత్యా నేరమని అధికారులు స్పష్టంగా పేర్కొన్నారు. అలాగే, సారాయి సంబంధిత సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 14405 కు కాల్ చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సారాయి కారణంగా కలిగే ఆరోగ్యదుష్పరిణామాలు మరియు నేరపూరిత ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్థులతో కలిసి నవోదయం ప్రతిజ్ఞ చేయించారు. అలాగే సారాయి నేరాలలో లీనంకాని వారికి పునరావాసం, మరియు ఎం.జి.నరేగా కింద 100 రోజుల ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ గ్రామ సభలు గ్రామస్థులలో చైతన్యాన్ని కలిగించడంలో, మత్తుపదార్థాల నిర్మూలనపై అవగాహన పెంపొందించడంలో కీలకపాత్ర పోషించాయి.

## త్రాగునిటి రిఫ్రిజిరేటర్‌ను అందజేసిన తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థలు

**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల పట్టణ పోలీసు స్టేషన్లోకి వచ్చే ప్రజలకు వేసవికాలం కావున ప్రజలకు త్రాగునిటి దాహార్తి తీర్చేందుకు రిఫ్రిజిరేటర్ ను స్పాన్సర్డ్ చేసిన తిరుమల ఆక్స్ఫర్డ్ విద్య సంస్థల యాజమాన్యము కు పోలీసు సిబ్బంది ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట మేజర్ న్యూస్ :** లింగంగుంట్ల పక్కన వెంకటాద్రి నగర్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేయనున్న మున్సిపాలిటీ వాటర్ పైప్లైన్ కి శంకుస్థాపన చేసిన గౌరవ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్న డాక్టర్ చదలవాడా అరవింద బాబుకి ఆ కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ డి ఇ మరియు నాయకులు కార్యకర్తలు కాలనీ వాసులు పాలుగోన్నారు.

## గవర్నమెంట్ హాస్పిటల్ పెషేంట్ల ఇక్కట్లు చూసి చలించిన వినుకొండ టౌన్ ఎస్ఐ



**వినుకొండ మేజర్ న్యూస్ :** వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పెషేంట్లు కూర్చోవటానికి కుర్చీలు లేక ఇబ్బంది పడుతున్నారు అని తెలుసుకున్న స్థానిక ఎస్ఐ ఆసుపత్రి సూపరిండెంట్ అయినా డాక్టర్ రజాక్ కి ఫోన్ చేసి విషయం గురించి తెలుసుకున్నారు. విషయం గురించి తెలుసుకున్న ఎస్ఐ స్వర్ణలత డాక్టర్ సూచన మెరుకు పెషేంట్లు కూర్చోవటానికి ఒక చైర్ సెట్ బహుకరించడం జరిగినది.

# సంక్షేమ కార్యక్రమాల అమలులో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్

**గుంటూరు, మేజర్ న్యూస్ :** శుక్రువారం సాయంత్రం కలెక్టరేట్ లోని డిఆర్సి సమావేశ మందిరంలో 2025 సంవత్సరానికి గాను జిల్లా స్థాయి వికలాంగుల(దివ్యాంగుల) కమిటీ మొదటి సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, వికలాంగుల సంక్షేమ అధికారిణి సువార్త తో కలసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో వికలాంగుల సంక్షేమం, ట్రాన్స్ జండర్స్ సీనియర్ సిటిజన్స్ సంక్షేమం పై తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. ఏజెండా లో పేర్కొన్న వికలాంగుల హక్కుల చట్టం 2016, వికలాంగుల సర్టిఫికెట్లు మరియు యు డి ఐ డి కార్డుల జారీ, పేదరిక నిర్మూలన మరియు వివిధ అభివృద్ధి పథకాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో 5శాతం రిజర్వేషన్ అమలు, ప్రభుత్వ షాపింగ్ కాంప్లెక్స్ లు, మునిసిపల్ కాంప్లెక్స్‌లో దుకాణాలు, స్టాళ్ల కేటాయింపు, వికలాంగులకు అవరోధ రహిత వాతావరణాన్ని అందించడం, వికలాంగుల గుర్తింపు, ఆన్‌లైన్ మోడ్ ద్వారా సహాయాలు (www.apdascac. ap.gov.in) ఉపకరణాల సరఫరా, OBMMS / NDFDC ద్వారా నైపుణ్య అభివృద్ధి & స్వయం ఉపాధి పథకాలు, బ్యాంక్ రుణాలు పై సమావేశంలో పాల్గొన్న ఎన్‌జిఓ లు, అసోసియేషన్ ప్రతినిధులు, కమిటీ మెంబర్స్ తో చర్చించి అభిప్రాయాలు సేకరించడం జరిగింది. సదరన్ సర్టిఫికెట్లు జిజిహెచ్ లో రీ–వెరిఫికేషన్ జరుగుతుందని స్లాట్ బుక్కింగ్ చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇచ్చే యూడిఐడి కార్డ్స్ కు




ఇబ్బందులు ఎదరవుతున్నాయని, సదరన్ సర్టిఫికేట్లు, యూడిఐడి లు వేర్వేరుగా ఇస్తున్నారని, రెండు ఒక దానిలోనే ఇస్తే బాగుంటుందని అసోసియేషన్ ప్రతినిధులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. 100 శాతం వినికిడి లోపం ఉన్నవాళ్లకి బస్ పాసులు ఇవ్వాలని కోరారు. వికలాంగుల ఉద్యోగాలలో 5 శాతం రిజర్వేషన్ అమలు చేస్తే వికలాంగుల కుటుంబాలు బాగుంటాయన్నారు. వికలాంగులకు మున్సిపల్ కాంప్లెక్స్ లో షాపులు కేటాయించాలని, ట్రై సైకిల్స్ మంజూరు చేయాలని, ప్రభుత్వ కార్యాలయాలు మొదటి అంతస్తులో ఉన్నందున లిఫ్ట్, ర్యాంప్, వీల్ చైర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గుంటూరు గాంధీ పార్క్ లో వికలాంగులు లోనికి వెళ్ళేందుకు ర్యాంపులు లేవని, వీల్ చైర్స్ కూడా లేవని ఏర్పాటు చేయవలసిందిగా జిల్లా సంయుక్త కలెక్టర్ ను కోరారు. అవసరమైన వికలాంగులకు వీల్ చైర్స్, స్మార్ట్ స్టిక్స్, ట్రై సైకిల్స్ అందజేయాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలలో వికలాంగులు పని చేసే చోట గ్రీవెన్స్ ఆఫీసర్ ని నియమించాలని కోరారు. ప్రతి దివ్యాంగునకు రేషన్ కార్డు ఇప్పించాలని, ఒంటరి మహిళలకు పెన్షన్ అందించాలని, ప్రతి నెల ఒక్కరోజు జిల్లాలో వికలాంగులకు స్పెషల్ గ్రీవెన్స్ జరిగేలా చూడాలని సంయుక్త కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే సబ్సిడీ లోన్స్ మంజూరు చేయుటలో గ్యారంటరిగా ప్రభుత్వ ఉద్యోగుల షూరిటీ తో పాటు ఆ ఉద్యోగి పని చేసే కార్యాలయపు డిడిఓ సంతకం అడుగుతున్నారని, ఈ విషయం బ్యాంక్ వారి దృష్టికి తీసుకొని వచ్చి డిడిఓ సంతకాన్ని మినహాయించేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా వికలాంగుల సంక్షేమ అధికారిణి సువార్త మాట్లాడుతూ అంధులకు టచ్ ఫోన్ లు ఉన్నాయని వాటిని శాఖపరంగా అందజేయటం జరుగుతుందని, దానికి 18 సంవత్సరాలు నిండి ఇంటర్ ఎడ్యుకేషన్ ఉండాలని తెలిపారు. ఎవరైనా అలాంటి వారు ఉంటే టచ్ ఫోన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బివిఎన్ సాయి కుమార్, డిఎంహెచ్ఓ డా.కె.విజయలక్ష్మీ, డిసిహెచ్ఎస్ ఝాన్సీ లక్ష్మీ, ఎల్‌డిఎం మహిపాల్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ గుర్రం బ్రహ్మయ్య, జిఎంసి డిసి డి.శ్రీనివాస్ రావు, డిఎస్‌డిఓ కె.సంజీవ రావు, ఏడి ఎడ్యుకేషన్ ఎస్.నిర్మల రాణి, వివిధ వికలాంగుల సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

### శ్రీ అభయ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంలో

# వైశాఖ మాస పవిత్రోత్సవాలు, అభిషేకములు

**పిడుగురాళ్ల మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల పట్టణంలో మార్కెట్ యార్డు సమీపంలోని శ్రీ అభయ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంలో వైశాఖ మాస పవిత్రోత్సవాలు, అభిషేకములు జరుగునని దేవస్థానం కమిటీ అధ్యక్షులు ఆలేటి మల్లికార్జునరావు (లాయర్ మల్లి) ఒక ప్రకటనలో తెలిపినారు. ది: 28/04/2025 సోమవారం నుండి 22/05/2025 గురువారం హనుమాన్ జయంతి వరకు ప్రతిరోజు ఉదయం 6:00 గంటలకు మూలవిరాట్ కు, ఉత్సవ విగ్రహ మూర్తులకు అభిషేకము, నాగవల్లి సహస్రనామార్చన జరుగును. వైశాఖమాసం నందు అభిషేకము చేయుటవలన విశేష ఫలితం కలుగును. జాతకరీత్యా దోషము, శని దోషము, సకల కార్యసిద్ధి కలుగును. వైశాఖ మాస ప్రారంభం 28/04/2025 సోమవారం విష్వక్సేన ఆరాధన, కంకణ ధారణ, అభిషేకము, నాగవల్లి అర్చన జరుగును. ప్రతిరోజు 25 రోజులపాటు




పంచామృతాలతో అభిషేకములు, నాగమల్లి సహస్రనామార్చన జరుగును. ప్రత్యేకమైన రోజులు : 30/04/2025 బుధవారం రోహిణి నక్షత్రం, శ్రీకృష్ణ పరమాత్ముడికి అభిషేకము, తులసీదళ అర్చన ప్రత్యేకంగా చేయబడును. 03/05/2025 శనివారం పునర్వాసు నక్షత్రం, ప్రత్యేకంగా సీతారామ లక్ష్మణ హనుమంతునికి అభిషేకము, మల్లెలతో అర్చన చేయబడునని. 06/05/2025 మంగళవారం ప్రత్యేకంగా ఉదయం 5 గంటలకు అభిషేకము, నాగవల్లి అర్చన జరుగునని. 11/05/2025 ఆదివారం నరసింహస్వామి జయంతి రోజున ప్రత్యేకంగా రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత నరసింహస్వామికి పంచామృతాల అభిషేకము, తులసీదళ అర్చన జరుగునని. 12/05/2025 వైశాఖ పౌర్ణమి అభిషేకం నాగవల్లి దళ అర్చన జరుగునని. 13/05/2025 మంగళవారం ప్రత్యేకంగా జరుగునని. 19/05/2025 నక్షత్రం, శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి ప్రత్యేకంగా అభిషేకం జరుగునని. 22/05/2023 ఉత్సవములు జరుగునని. 28/04/2025 సోమవారం నుండి 22/05/2025 గురువారం వరకు 25 రోజులపాటు ప్రతిరోజు అభిషేకం జరుగును. ఒక్కరోజు అభిషేకము, సహస్రనామార్చన, ప్రసాదము, దక్షిణ కలుపుకొని 1600/- రూపాయలు ఖర్చు అగునని తెలిపారు..అలాగే ప్రతిరోజు గోత్రనామాలు అభిషేకంలో అర్చనలో చెప్పబడును. దేవస్థానం ప్రధాన అర్చకులు సన్నగండ్ల వెంకట రమణ చార్యులు తెలియపరిచారు....

# యథేచ్ఛగా పల్లాలమ్మ చెరువు నీటి చౌర్యం .. పట్టించుకోని సంబంధిత అధికారులు

**పెదకాకాని,మేజర్ న్యూస్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో పల్లాలమ్మ చెరువులోని నీటిని అక్రమంగా బయటకు తరలించడాన్ని నిలిపివేయాలని పలుమార్లు ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేసినప్పటికీ ఈరోజు యదేచ్ఛగా నీటిని మోటార్ల ద్వారా బయటకు పంపించడం జరుగుతోంది. చేపల పాటదారునికి అండదండలుగా పెదకాకాని గ్రామపంచాయతీ 10వ, వార్డు మెంబర్, వైస్ ప్రెసిడెంట్ అండదండలు పుష్కలంగా ఉన్నాయని, అందువల్లనే పాటదారుడు అంత ధైర్యముగా నీటిని బయటకు పంపించడం జరుగుతుందని, పొన్నూరు నియోజకవర్గ సిపిఐ పార్టీ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అన్నారు. గురువారం మెమోరాండము సమర్పించిన సమయంలో పెదకాకాని పంచాయతీ కార్యదర్శి మేము చెరువులోని నీరు బయటకు పెట్టుటకు ఎవరికి అనుమతి ఇవ్వలేదని, అలాగే పంచాయతీ వారి మోటర్లను కూడా ఇవ్వలేదని తెలియజేయడం జరిగినది. అయినప్పటికీ ఆ మోటార్లు పంచాయతీ వారివేనని తెలియచున్నది. కనుక పంచాయతీ వారు ఆ మోటార్లను వెంటనే హ్యాండ్ వర్ చేసుకొని ఈ వేసవికాలంలో భూగర్భ జలాలు ఇంకిపోకుండా పెదకాకాని గ్రామ ప్రజల అవసరాలతో పాటు, గ్రామంలో ఉన్న 3 పుణ్యక్షేత్రాలకు ప్రతిరోజు వచ్చే భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని, పశుపక్షాదుల దప్పికను తీర్చే చర్యలు చేపట్టాలని ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు. ఈ వేసవికాలంలో చెరువులో నీరు లేకపోయినట్లయితే, గ్రామంలోని భూగర్భ జలాలు ఇంకిపోవుట వలన బావులలోను, బోరులలోను గ్రామ అవసరాలకు నీరు చాలక , గ్రామ ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొనవలసి రావడంతో పాటు, పశువులకు, పక్షులకు దాహార్తి తీర్చుకునే అవకాశం ఉండదన్నారు. నీటిని బయటకు పంపించే కార్యక్రమం ఆగనిపక్షంలో జిల్లా కలెక్టర్ గారికి కూడా వినతి పత్రం సమర్పించి, పెదకాకాని గ్రామ ప్రజల నీటి సమస్యను తీర్చి న్యాయం చేయమని కోరదలచామనీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కేతినేని అగస్టీన్, గుంటూరు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి రామిశెట్టి శ్రీనివాసరావు, బొట్టు శ్రీనివాసరావు, రెంటాల మోజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### దళారుల రాజ్యంలో

# బ్రతుకులు ఛిద్రం

(మొదటి పేజీ తరువాయి)

అధికార యంత్రాంగం రంగంలోకి దిగేది. అక్రమం గా నిల్వచేసిన సరుకులను వెలికితీసి వ్యాపా రులపై కేసులు నమోదు చేసేవారు. క్షణాల్లో ధరలు దిగివచ్చేవి. కాని ఆ పరిస్థితి మచ్చు కైనా కనబడడం లేదు. వంట నూనె ధరలు కిలో ఒక్కింటికి 90 నుంచి 160 రోజుల్లోనే 80 రూపాయలు పెరిగింది. ఉక్రెయిన్ యుద్ధం ఆరంభమైనప్పటి నుంచే నూనె ధరలకు కళ్లెం వేయలేకపోయారు. ఇప్పుడది . ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉండడంతో సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు బెంబే లెత్తిపోతున్నాయి. వంట నూనెలకే కిలోకి సరాసరిన వంద రూపాయలు చొప్పున అదన పు భారమైంది. వేరుశెనగ, సన్‌ఫ్లవర్, రైస్‌రిచ్ తరహా వంట నూనె ధరలతో అమాంతం హొటళ్లల్లో తినుబండారాలు భారీగా పెంచేశా రు. ఇంతకుముందు మినపట్టు, గారెతో సహా నూనెతో తయారయ్యే టిఫిన్‌లు అన్నీ గరిష్టం గా రూ.30 నుంచి 50 ఉండగా, ఇప్పుడా ధర రూ.60 నుంచి రూ.75 పెరిగింది. చికెన్, మటన్ ధరలు 260, 350 రూపాయలు చొప్పున పెరిగాయి. ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఈ ప్రాంతానికి భారీగా కంది, పెసర, మినపప్పులు భారీగా దిగుమతి అయ్యేవి. కాని అక్కడ సాగు తగ్గుముఖం పట్టిందనే వంకతో ఏకంగా కందిపప్పు ఏడాది క్రితం రూ.150 ఉండగా. ఇప్పుడది రూ.180కి పైగా చేరింది. మొదటి, రెండో రకం గ్రేడులుగా మార్చి పప్పు ధరల్లో వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ధర పెరిగిందేమిటని నిలదీస్తే రెండో రకం పప్పు కాస్త ధర తగ్గించి అంటగడుతున్నారు. పెసర పప్పుదీ ఇదే తీరు. వేరుశెనగ గుళ్ళు రూ.110 నుంచి రూ.130 రూపాయలకు పెరిగింది.మార్కెట్‌లో పప్పు, ఉప్పేకాదు మిగతా ధరలు దూసుకుపోతూనే ఉన్నాయి. చికెన్ చిక్కకుండా పోయింది. ఒకప్పుడు కేవలంరూ. 150 నుంచి 160 రూపాయలే ఉండగా, ఇప్పుడది 260 రూపాయలు వద్ద ప్రస్తుతానికి నిలకడగా ఉంది. గడిచిన ఏడాదిగా చికెన్ ధరలు క్రమేపీ పెరుగుతున్నాయి పెరుగుతున్న వినియోగం ఒక ఎత్తయితే కూరగాయలు, ఇతర ధరలు మండిపోతున్నాయి. గుడ్లు ధరలు ఎగు దిగుడుగా ఉన్నప్పటికీ సరాసరిన 4 నుంచి 5 రూపాయల ధర పలుకుతుం ది. చేపలు, రొయ్యల సంగతి చెప్పనక్కర్లేదు. మార్కెట్‌లో తెల్ల చేపల ధరలు కిలో ఒక్కింటికి రూ.180 నుంచిరూ. 200 ధర పలుకుతుండగా, అదే రొయ్యలైతే ఏకంగా 350 రూపాయలకు చేరాయి. మార్కెట్‌లో పొంతనలేకుండా దూసు కెళ్తున్న ధరలు సామాన్యులను బిక్కముఖం వేసుకునేలా చేస్తున్నాయి. వీటికి తోడు నాణ్యత కలిగిన బియ్యం 25 కిలోల బస్తా వెయ్యి నుంచి 1250 చొప్పున ధర పలుకుతున్నాయి. కూరగాయల ధరలదీ ఇదే పరిస్థితి. ఒక్క ఉల్లి ధర దిగిరాగా కొత్తిమీర కట్ట రూ.35 ములక్కాడలు రెండు రూ.20, టమోటా రూ.60చొప్పున మంట మండిస్తున్నాయి. వీటికి అదనంగా పెట్రోలు ధర రికార్డు స్థాయి కి చేరింది. లీటరు ఒక్కింటికి 123 రూపాయలకు చేరింది. గ్యాస్ బండ వరుసగా పెరిగిన ధరలతో 1130కు చేరి వినియోగదారుల ఇంట గుదిబండగా మారింది. పొదుపు మాటే లేదుమారిన ధరల పట్టికలతో సాధారణ, మధ్య తరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్ బోల్తా కొట్టింది. ఒకప్పుడు రోజువారి దిన సరి కూలితో కాలం గడుపుకొచ్చే వారు కూడా అంతో ఇంతో ఆరోగ్యానికి, ఇతరత్ర ఖర్చులకు కాస్త కూడబెట్టే వారు. మధ్యతరగతి కుటుంబాలైతే నెలవారీ చిట్టీలు, పిల్లల పేరిట నెలవారీ పోస్టల్, బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారు. కాని ఇప్పుడు పరిస్థితే మారింది. పొదుపు మాత్రం పరారైంది. ఆ స్థానంలో ధరల మంత్రం ము దుకొచ్చింది. నెలవారీ బడ్జెట్ ఒకప్పుడు సాధారణ కుటుంబాల్లో 16 వేల నుంచి 21 వేలలోపు సరాసరిన ఉండేవి. కూరగాయలు, పాలు, కిరాణా ఖర్చులతో కలిసి మూడొంతులు ఖర్చయ్యేవి. వీటికి తోడు ఇప్పుడు ఇంటి అద్దెలు తడిసి మోపె డయ్యాయి. పట్టణ, పల్లె ప్రాంతాల్లో ఆస్తి పన్నులు పెంచేయడంతో పట్టణ ప్రాంతాల్లో అయితే డబుల్ బెడ్‌రూం 4,500 నుంచి 7,500 రూపాయలకు అద్దె పెంచేశారు. సాధారణ ఇంటికి కరెంటు చార్జీలు 650 నుంచి గరిష్టంగా 900లోపే వచ్చేది. ఇప్పుడది కాస్తా 1800లకు పెరిగింది. ఎడాపెడా ధరలు పెంచే స్తూ పోతుండడంతో మధ్యతరగతి కుటుంబాలు విల విలాడుతున్నాయి. క్లిష్ట పరిస్థితిని సరిదిద్దాల్సిన ప్రభుత్వం సంక్షేమం పేరిట వేల కోట్లు ఖర్చు చేస్తుందే తప్ప, ధరలను నియంత్రించడం లేదు.

# అక్రమ నాటు సారాయి అమ్మకంపై దాడి..!

(మొదటి పేజీ తరువాయి)

అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై ఎప్పటికప్పుడు దాడులు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో ప్రజల సహకారం ఎంతో కీలకమని, నాటు సారా లేదా నాన్-డ్యూటీ పెయిడ్ లిక్కర్ విక్రయ సమాచారం ఎవరికైనా ఉంటే ఎక్సైజ్ శాఖకు అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయని ఆయన హామీ ఇచ్చారు.ఈ తరహా అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ మరింత గట్టి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా నాటుసారాయి నిర్మూలన లక్ష్యంగా ఉద్దేశించిన ఈ దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## హైకోర్టు న్యాయవాదిపై దాడి హేయమమైన చర్య : గంగూరి అజయ్



సత్తెనపల్లి మేజర్ న్యూస్ : సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అనంతరం తాలుకా న్యాయస్థానంలో ఉన్న న్యాయదేవత విగ్రహం వద్ద న్యాయవాదులు అందరు కలిసి నిరసన తెలిపారు. న్యాయవాది అయిన కోటిపల్లి అయ్యప్ప పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించటమే కాక,న్యాయవాద పరిరక్షణ చట్టం ను అమలు చేయాలని న్యాయవాదుల ఐక్యత వర్ధిల్లాలి అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంగూరి అజయ్ కుమార్ మరియు న్యాయవాదులు మహంకాళి కోటేశ్వరమ్మ, అంకాళ్ళ వెంకటేశ్వర్లు,కన్నెధార హనుమయ్య,కళ్ళం వీర భాస్కరరెడ్డి, దివ్వెల శ్రీనివాసరావు, బుర్రి సైదయ్య,రాజశేఖరుని గోపాల కృష్ణమూర్తి, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, తవ్వా హరనాథ్, బాదినేడి శ్రీనివాసరావు, గంపా మదన్ గోపాల్, బాదరబోయిన వెంకటేశ్వరరావు, ఉల్లం మధు, రాజవరపు నరసింహరావు,తెనాలి నవ జ్యోతి బాబు తదితరులు పాల్గొన్నారు .

## నూతన ఫంక్షన్ హాల్ ను ప్రారంభించిన కన్నా



**సత్తెనపల్లి మేజర్ న్యూస్ :**

సత్తెనపల్లి పట్టణం పిడుగురాళ్ల రోడ్డు వెన్న దేవి గ్రామ సమీపంలో నిర్మించిన నారాయణ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ ను మాజీ మంత్రి, శాసన సభ్యులు. కన్నా లక్ష్మి నారాయణ ప్రారంభించారు. అనంతరం ఫంక్షన్ హాల్ నిర్మించిన సీనియర్ న్యాయవాది ఆదినారాయణకు కన్నా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాంలో పలువురు న్యాయవాదులు టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## నేడు బాబు జగ్జీవన్ రామ్ జయంతి

నూజెండ్ల మేజర్ న్యూస్:- మండలంలోని పెద్దవరం గ్రామ పాఠశాలలో శుక్రవారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఒకరోజు ముందుగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి పూలతో ఘన నివాళి తెలిపారు. పాఠశాల హెచ్ఎం ఘంటా నాగేశ్వరరావు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ బాపూజీ గా ప్రసిద్ధి చెందాడని, ఒక భారతీయ స్వాతంత్ర్య కార్యకర్త మరియు రాజకీయ నాయకుడు అని తెలియజేశారు. షెడ్యూల్ కులాల వంటి అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు అన్నారు. భారత పార్లమెంటులో అనేక శాఖల మంత్రిగా మరియు భారత ఉప ప్రధానిగా పనిచేశారని తెలియజేశారు. ఏప్రిల్ 5న ఆయన జయంతి సందర్భంగా తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సాధారణ సెలవు గా ఉంటుందన్నారు. అందుకే మన పాఠశాలకు కూడా సెలవు అవుతుందని విద్యార్థులకు తెలియజేశారు. మీరు కూడా చక్కగా చదువుకొని ఇటువంటి మహనీయుల బాటలో నడవాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## బర్డ్ ఫ్లూతో చనిపోయిన చిన్నారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలి

- పల్నాడు జిల్లాను బర్డ్ ఫ్లూ ఇన్ఫెక్షన్ సెంటర్ గా డిక్లేర్ చేయాలని డిమాండ్
- పాపకు బర్డ్ ఫ్లూ సోకలేదని ఎమ్మెల్యే చెప్పడం హాస్యాస్పదం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



**నరసరావుపేట రూరల్, మేజర్ న్యూస్:**

బర్డ్ ఫ్లూతో చనిపోయిన నరసరావుపేట పట్టణంలోని బాలయ్య నగర్ కు చెందిన రెండేళ్ల చిన్నారి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ ఇంఛార్జి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,, బర్డ్ ఫ్లూతో బాలిక చనిపోవడం బాధాకరమన్నారు. అయితే మంగళగిరి ఎయిమ్స్ వైద్యులు అవయవాలు పనిచేయకపోవడం వల్లే చనిపోయిందని నిర్ధారించడం జరిగిందని చెప్పడంలో ఆంతర్యం ఏమిటి అన్నారు. ఈ పాపకు బర్డ్ ఫ్లూ సోకిందనే విషయాన్ని భారతదేశంలోని అత్యంత ప్రతిష్టమాత్మక వైరాలజీ సంస్థ ఐ సి ఎం ఆర్ నిర్ధారించింది. ఇది సామాన్యమైన విషయం కాదు స్థానిక ఎమ్మెల్యే అరవింద్ బాబు పాపకి సోకింది బర్డ్ ఫ్లూ కాదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ వ్యాధి పట్ల ఆయనకు ఏ మాత్రం అవగాహన లేదని స్పష్టమవుతుందన్నారు. బర్డ్ ఫ్లూ రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. పచ్చి మాంసం తినటం, చనిపోయిన కోళ్లను తాకినా, పక్షుల నుంచి వచ్చిన లాలాజలం తాకినా, ఇతర ప్రదేశాల నుంచి వచ్చిన పక్షుల నుండి కూడా ఈ వ్యాధి సోకవచ్చని చెప్పారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆరు జిల్లాలను బర్డ్ ఫ్లూ ఇన్ఫెక్షన్ సెంటర్లు గా డిక్లేర్ చేయడం జరిగిందన్నారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కాకినాడ, ఏలూరు, ఎన్టీఆర్,కర్నూలు జిల్లాలను ప్రకటించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఒక బాలిక బర్డ్ ఫ్లూ వ్యాధితో చనిపోతే ఇన్ఫెక్షన్ సెంటర్ గా ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ ఏరియాలో 10 కోళ్లు కూడా బర్డ్ ఫ్లూ వ్యాధితో చనిపోయినట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. దీని మీద కూడా విచారణ చేయాలన్నారు. గతంలో కోవిడ్ సమయంలో వాలంటీర్లు ప్రతి ఇంటికి సర్వే లైన్స్ నిర్వహించి ఏ ఇంట్లో జ్వరం ఉన్న, ఏ వ్యాధి ఉన్న వారిని వెంటనే చికిత్స పొందే ఏర్పాటు చేయడం జరిగింది. ఈరోజు ఆ వ్యవస్థ లేదు సర్వేలైన్స్ కార్యక్రమం చేసే దిక్కులేదు, మెడికల్ అండ్ హెల్త్ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. మందులు లేవు ,డాక్టర్లు లేరు వైద్యం అందడం లేదు, ప్రైవేట్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు నడిచే పరిస్థితి లేదు ,ఆరోగ్యశ్రీ నిధులు 3500 కోట్లు ఈ ప్రభుత్వం బకాయి పెట్టిందని ఆరోపించారు. ఇప్పటికే ప్రైవేట్ ఆస్పత్రులు ఏప్రిల్ 7 తేదీ నుంచి ఆరోగ్యశ్రీ సేవలను బంద్ చేస్తామని నోటీసులు ఇచ్చిన ప్రభుత్వం స్పందించడం లేదు.ఈ రాష్ట్రంలో పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఒక వ్యక్తి బర్డ్ ఫ్లూ వ్యాధితో చనిపోతే ఆరోగ్య శాఖ మంత్రి ఏం చేస్తున్నారు, ప్రిన్సిపల్ సెక్రెటరీ గాని ఆరోగ్య శాఖ మంత్రి గాని నరసరావుపేటకు వచ్చి కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే బర్డ్ ఫ్లూ వైరస్ ఉందా,, లేదా అనే దానిపై విచారణ చేసి తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని గోపిరెడ్డి డిమాండ్ చేశారు.



## సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం

దుగ్గిరాల,మేజర్ న్యూస్ .దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ,పెదపాలెం గ్రామాల్లో గ్రామ రైతు సేవా కేంద్రం లో శుక్రవారం సమాచార హక్కు చట్టం గురించి అవగాహన కార్యక్రమం జరిగింది .ఈ సదస్సులో మండల వ్యవసాయ అధికారి పి. శిరీష గ్రామ సర్పంచ్ పాటిబండ్ల కృష్ణ ప్రసాద్ ,ఏఈఓ ఏ. రమేష్ బాబు పాల్గొన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి పి. శిరీష మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కేంద్ర ప్రభుత్వం ద్వారా 200.5 సంవత్సరంలో నుంచి అమల్లోకి వచ్చినట్లు తెలిపారు.ఈ చట్టం ద్వారా ప్రభుత్వ నుండి జరుగుతున్న ప్రతి కార్యక్రమ వివరాలు మరియు కార్యాలయంలోనీ ఏ సమాచారమైన పౌరులు పొంద వచ్చునని తెలిపారు.సమాచార హక్కు చట్టం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నియమించబడినటువంటి కమిషనర్ల ద్వారా పర్యవేక్షించబడుతుందని తెలిపారు .సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు కోరీ.న సమా చారం 30 రోజులలోపు అందించవలసిన అవసరం ఉన్నదని తెలిపారు. అధికారులు 30 రోజుల్లో సమా చారం అందించ లేకపోయినట్లయితే అప్పిలేట్ అధికారి, ఆపిలేట్ అథారిటీకి ఫిర్యాదు చేయడం ద్వారా సరైన సమాచారంను పౌరులు పొందవచ్చునని శిరీష తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాటి బండ్ల కృష్ణ ప్రసాద్ ,వ్యవసాయ విస్తరణ అధికారి ఏ .రమేష్ బాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు అలేఖ్య , సౌమిత్రి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే జూలకంటి సీరియస్..!

- వేసవిలో నీటి ఎద్దడిని తట్టుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారి.



**వెల్దుర్తి, మేజర్ న్యూస్ :**

మాచర్ల నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనే పరిస్థితి రాకూడదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం వెల్దుర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో ఐదు మండలాల ఎస్‌డబ్ల్యూవోలు (గ్రామ నీటి పారుదల శాఖ అధికారులు)తో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి కాలంలో నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లోని నీటి మోటర్లకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా పర్యవేక్షించాలని, మరమ్మతుల అవసరం తలెత్తిన వెంటనే వాటిని సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు తాగునీటి సమస్య ఎదురైతే ఎప్పుడైనా నేరుగా తనను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు.

### రూ.1200 కోట్లతో నీటి సరఫరా ప్రాజెక్టులు

నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలు, తండాలలో సురక్షితమైన మంచినీటిని అందించేందుకు జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.1200 కోట్ల నిధులను కేటాయించామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ నిధులతో రాబోయే రోజుల్లో పలు ప్రాజెక్టులను అమలు చేసి, ప్రజలకు కుళాయిల ద్వారా నాణ్యమైన తాగునీరు అందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.

### నీటి సమస్యపై ఎమ్మెల్యే హెచ్చరిక

ప్రజలకు తాగునీటి సరఫరాలో ఏదైనా అడ్డంకులు ఏర్పడితే తాను ఊరుకోబోనని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రభుత్వం అందించే సేవలు ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులంతా కృషి చేయాలని సూచించారు. తాగునీటి విషయంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే దృష్టికి తీసుకురావాలని కోరారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ సంఘ అధ్యక్షునిగా మొగలి "వెంకట్రావు"

**వినుకొండ మేజర్ న్యూస్:-**

ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ల నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రమైన వినుకొండ ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయం నందు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన అధ్యక్షుడిగా మొగలి వెంకట్రావు ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రావూరి వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా నంబూరి గురువారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కానాల కొండలరెడ్డి, కోశాధికారిగా గురజాల సుబ్బారావుతో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏపీవో కట్టా నాగేశ్వరరావు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సహాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# హెూమియో వైద్య రంగంలో రారాజు డాక్టర్ రమణ

- ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఏల్చూరి వెంకటేశ్వర్లు.
(కళారత్న డాక్టర్ ఓ.వి.రమణ ను ఘనంగా సత్కరించిన ఇ.వి.వి. యువ



**గుంటూరు రూరల్ మేజర్ న్యూస్**

హెూమియో వైద్య రంగంలో విప్లవాత్మకమైన వైద్య విధానాలను తన చికిత్స ద్వారా అందించిన ఘనత డాక్టర్ ఓరుగంటి వెంకటరమణ కే దక్కుతుందని ది ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు అన్నారు. ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కళారత్న (హంస) అవార్డు స్వీకరించిన ప్రముఖ హెూమియో వైద్య నిపుణులు డాక్టర్ ఓ.వి.రమణ ను శుక్రవారం కృష్ణనగర్ సాయి నిలయంలో జరిగిన కార్యక్రమంలో సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఇ.వి.వి యువ కళా వాహిని ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఏల్చూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..హెూమియో వైద్యానికి గుంటూరు నగరాన్ని ప్రసిద్ధి చెందిన ప్రాంతంగా మార్చటంలో డాక్టర్ రమణ కృషి ఎంతో వుందన్నారు. హెూమియో రంగంలో రారాజు రమణ అని ప్రశంసించారు. హెూమియోతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందిస్తున్న రమణ ఎంతైనా అభినందనీయులన్నారు.సెంట్రల్ ఎక్సైజ్ విశ్రాంత సూపరింటెండెంట్ గుమ్మడి సీతారామయ్య చౌదరి మాట్లాడుతూ.. హెూమియోతో కాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు కూడా నయం చేయవచ్చునని డాక్టర్ రమణ నిరూపించారన్నారు. హెూమియోలో వినూత్న విధానాల ద్వారా రమణ ప్రజలకు సేవలందించారన్నారు. సమర్థత కు ప్రతిరూపమైన రమణ కు ప్రభుత్వం కళారత్న అవార్డు అందచేయడం ప్రతిభ కు ఇచ్చిన ప్రశంస అని కొనియాడారు.కళారత్న అవార్డు పురస్కార గ్రహీత డాక్టర్ ఓరుగంటి వెంకటరమణ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం తన కృషి, ప్రతిభ ను గుర్తించి, కళారత్న పురస్కారంతో గౌరవించడం సంతోషంగా ఉందన్నారు. ఇది మరింత బాధ్యతగా తమ రంగంలో విశిష్ట సేవలందించడానికి ఉత్తేరకంగా పనిచేస్తుందన్నారు. ఆధునిక యుగంలో హెూమియో వైద్యం పేద ప్రజల పాలిట సంజీవని అన్నారు.కళావాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి మాట్లాడుతూ..ఆంగ్ల వైద్యానికి ధీటుగా గుంటూరు జిల్లాలో హెూమియో వైద్యం యొక్క గొప్పదనం, విశిష్టత ను చాటి చెప్పిన మహెూన్నత వైద్యుడు ఓరుగంటి అని కీర్తించారు. భవిష్యత్ లో రమణ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాక్షించారు. కళావాహిని ఉపాధ్యక్షుడు దేవరశెట్టి సుబ్బారావు (బుల్లెట్) మాట్లాడుతూ..హెూమియో రంగంలో సాటిలేని వైద్యుడు రమణ అని, ఆయన గొప్ప సేవాతత్పరుడు అన్నారు.అనంతరం డాక్టర్ రమణ ను ఇ.వి.వి.యువ కళావాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో వేద పండితుల ఉచ్చారణ మధ్య ఘనంగా సత్కరించి, జ్ఞాపిక ను బహుకరించారు. ఈ సందర్భంగా పలువురు హెూమియో రంగంలో రమణ సాధించిన విజయాలను వివరించారు.

## ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో బాబు జగజీవన్ రావ్ జయంతి వేడుకలు



మేడికొండూరు, మేజర్ న్యూస్: మేడికొండూరు సమీపంలోని ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా బాబు జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసు మాట్లాడుతూ బాబుజి అనే ముద్దు పేరుతో పిలుచుకుని జగజ్జీవన్ రామ్ అతి చిన్న వయసులో నెహ్రూ మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసిన ఘనత బాబు జగ్జీవన్ రావుకి దక్కుతుందని కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారని 1971లో ఇండోపాక్ యుద్ధంలో రక్షణ శాఖ మంత్రిగా కూడా విధులు నిర్వహించారని అలాగే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేస్తూ హరిత విప్లవానికి నాంది పలికారని, 1977 లో ఉప ప్రధానిగా బాధ్యతలు నిర్వహించారు.ఇదే కాకుండా స్వాతంత్ర సమరయోధుడిగా సంఘసంస్కర్తగా రాజకీయవేత్తగా 47 సంవత్సరాలు భారత పార్లమెంట్లో సభ్యునిగా ఉన్నారని తెలియజేశారు, అలాగే కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ కె శ్రీహరి మాట్లాడుతూ బీహార్ లోని అత్యంత వెనుకబడిన గ్రామం లో జన్మించి అంటరానితనాన్ని ఎదిరించి 1931లో కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ డిగ్రీ పొందారని గాంధీజీ ప్రారంభించిన అంటరానితనం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని అనేకమైన పేదలకు విద్యా అవకాశాలు కల్పించడంలో ప్రముఖ పాత్ర వహించారని తెలియజేశారు.. 1974 లో వచ్చిన ఆహార సంక్షోభాన్ని తన పరిజ్ఞానంతో ఎదుర్కొనేలా చర్యలు తీసుకొని దేశ ప్రజలను కాపాడి ఆకలి చావులను నిర్మూలించారని తెలియజేస్తూ క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రెండుసార్లు జైలు శిక్ష అనుభవించి బ్రిటిష్ వారిని ధైర్యంగా ఎదుర్కొన్న ధైర్యశాలి అని ప్రతి విద్యార్థి బాబు జగజీవన్ రావ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, మన స్థితిగతులేవైనా ఉన్నత స్థితికి వెళ్లడానికి ప్రతి విద్యార్థి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏఓ సీతారామయ్య వివిధ శాఖాధిపతులు చంద్రమౌళి, రెహమాన్, కె ఎస్ఆర్ నాగేశ్వరావు, సౌజన్య, కోటేశ్వరరావు, రాము బోధన బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పట్ల కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ పిడికిటి తిలక్ బాబు హర్షం వ్యక్తం చేశారు.

# జీఎంసీ లోని ప్రతి రిజర్వాయర్‌ని నిర్దేశిత గడువులోనే శుభ్రం చేయాలి

- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్:** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి రిజర్వాయర్ ని నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ గారు నాజ్ సెంటర్ లోని ఎల్ఎల్ఆర్ రిజర్వాయర్, ఎల్ఆర్ కాలనీ, నల్ల చెరువు, చంద్రమౌళి నగర్, రాజేంద్ర నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి రిజర్వాయర్ ని నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలన్నారు. ఎమినిటి కార్యదర్శులు తప్పనిసరిగా త్రాగునీటి సమయంలో క్లోరిన్ శ్యాంపిల్స్ సేకరించాలని, ఎక్కడైనా కలుషిత నీటి సరఫరాని గుర్తిస్తే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు. అలాగే పైప్ లైన్ లీకులను ఎప్పటికప్పుడు మరమత్తు చేయించాలని, త్రాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి, కార్మికులు మధ్యాహ్నం సమయంలో డ్రైన్లు శుభ్రం చేయడం లేదని ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని, ఇన్స్పెక్టర్లు, ఎస్ఎస్ మధ్యాహ్నం సమయంలో కార్మికుల పనితీరుని మెరుగ్గా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రధాన ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్ లేకుండా నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ చేయాలని, కమర్షియల్ సంస్థలు వ్యర్ధాలను రోడ్ల మీద వేయకుండా నోటీసులు ఇవ్వాలన్నారు. పర్యటనలో ఏసిపి రెహ్మాన్, డిఈఈ రమేష్ బాబు, టిపిఎస్ లు, ఏఈలు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మధ్యతరగతి వారికి అందుబాటు ధరల్లో ద్విచక్ర వాహనాలు అభినందనీయం

- నగర ఇన్చార్జి మేయర్ షేక్ సజీల



**గుంటూరు, రూరల్ మేజర్ న్యూస్:** అన్ని రకాల ద్విచక్ర వాహనాలు అందుబాటు ధరల్లో ఉండటం మధ్యతరగతి వారికి ఎంతో ఉపయోగం ఉంటుందనిగుంటూరు నగర మేయర్ ఇంచార్జ్ షేక్ సజీల పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక మంగళగిరి రోడ్డు పరమయకుంట పద్మజ పెట్రోల్ బంక్ ప్రక్కన మన గుంటూరు మన భారత్ వాహన్ పేరుతో వివిఆర్ ఆటోఫిన్ ద్విచక్ర వాహనాల అమ్మకాలు కొనుగోలు షాపును ఇన్చార్జి మేయర్ చేతుల మీదుగా ప్రారంభించారు. సందర్భంగా వి.వి.ఆర్ ఆటో ఫిన్ నిర్వాహకులు భాను ప్రసాద్ మాట్లాడుతూ తమ వద్ద అన్ని కంపెనీల ద్విచక్ర వాహనాలు అమ్మకాలు కొనుగోలు అందుబాటు ధరల్లో ఉంటాయని, అవసరమైన వారికి రుణ సౌకర్యం ఇన్సూరెన్స్ సౌకర్యాలు తమ వద్దనే సంబంధిత ఏజెన్సీల ద్వారా అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

# మిర్చి రైతుల ఆదుకోకపోతే ముట్టడి చేస్తాం

## రైతు, కౌలు సంఘాల నాయకులు హెచ్చరిక



**గుంటూరు మేజర్ న్యూస్ :**

శుక్రవారం ఉదయం గుంటూరు మిర్చి యార్డును రైతు,కౌలు రైతుల సంఘాల ఆధ్వర్యంలో మిర్చి యార్డులో ర్యాలీ ధర్నా నిర్వహించి అనంతరం యార్డ్ కార్యదర్శి కి వినత పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. రాధాకృష్ణమూర్తి ,రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంచుమాటి అజయ్ కుమార్ లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన ఎమ్ ఐ యస్ స్కీం ధర క్వింటాకు 11,781రూ. ప్రకటన చేయటం మోసపూరితమైందిగా అన్నారు. క్విం. మిర్చికి రూ.25వేల నుండి 30 వేల రూ.పైగా ఖర్చు అవుతుండగా దాంట్లో సగం మద్దతు ధర కల్పించినట్లు ప్రకటించటం అవగాహన రాహిత్యం లేదా మోసపూరిత మైనదన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ బలంతోనే కేంద్రంలో అధికారంలో ఉన్నది .ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తుసుకు వచ్చిజాతీయ స్థాయిలో గుంటూరు మిర్చి యార్డ్ ను పరిగణలో తీసుకొని ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న రైతు లకు న్యాయం చేయాలన్నారు.దేశవ్యాప్తంగా రైతులు మిర్చి యార్డ్ ద్వారా అమ్ముకోవడం జరుగుతుంది ఈ పరిస్థితిని అధిగమించుటకు కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేపట్టి స్థిర నిధి కరణ కేటాయించి ప్రభుత్వమే కొనుగోలు చేసినట్లయితే రైతు ,కౌలు రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. దీంతోపాటు ప్రభుత్వాలకు కూడా ఎగుమతుల ద్వారా మరియు దేశంలో వివిధ రకాలుగా వాడుతున్న నేపథ్యంలో లాభదాయక పంటగా ఉంటుందన్నారు. దేశంలోనే సంపద తయారు చేయబడే ఈ మిర్చి రైతులను ఆదుకోవలసిన అవసరం ఉన్నది. వీరికి తగిన ప్రోత్సాహాలు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా ప్రభుత్వ చర్యలు తీసుకోవాలి . 2018 నుంచి 2023 వరకు యావరేజ్ న 18 వేలు రూపాయల వరకు అత్యధిక ధర 27 వేల వరకు రేటు రావడం జరిగిందన్నారు.ఈ ఏడాది కేవలం 7వేల నుంచి 13 వేల లోపే రైతులు, కౌలు రైతులు అమ్ముకోవడం జరుగుతుందన్నారు. ఈ రేటు ప్రకారం మిర్చి రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం లేకపోలేదు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో స్థిరనిధీకరణకు కేవలం 300 కోట్లు కేటాయించడం అంటే రైతులంటే ఎంత తేలిక భావన అర్థమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 5000 కోట్ల రూపాయలు స్థిర నిధి కరణ కేటాయించి అన్ని పంటలను కొనుగోలు చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. మొదట నల్లపాడు రోడ్డు వైపు గేటు నుండి ర్యాలీగా నినాదాలు తో యార్డ్ కార్యదర్శి కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం ఈ సమస్యలన్నింటిపై యార్డ్ కార్యదర్శితో చర్చించడం జరిగింది. యార్డ్ కార్యదర్శి మాట్లాడుతూ ఇప్పటివరకు తమకు విధివిధానాలు ప్రభుత్వం నుండి రాలేదని చెప్పడంతో నాయకులు ఆశ్చర్యానికి,కోపానికి గురికావడం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన ధర నిర్ణయించేటప్పుడు యార్డ్ కార్యదర్శి మిర్చి రైతులను పరిగణలో తీసుకోకుండా ఈ ధరను నిర్ణయించడం దుర్మార్గమని ,గ్రామీణ స్థాయిలో అమ్ముకున్న మిర్చి రైతులకు కూడా ఈ స్కీం వర్తింపాలా, సాధారణ రకానికి 15 వేల రూపాయలు, నాణ్యతమైన మిర్చి 20 వేల రూ.వరకు ధర యం ఐ యస్ స్కీం లో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. లేనిపక్షంలో ఈనెల మొదటి వారంలో యార్డ్ ను ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు , పల్నాడు జిల్లా రైతు , కౌలు రైతుసంఘాల నాయకులు పాల్గొన్నారు. కౌలు రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు కామినేని రామారావు,రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ ,బొట్లా రామకృష్ణ , బిక్కి శ్రీనివాస్ రావు,గాడిద మల్ల పిచ్చా రావు, ఈవూరి అప్పిరెడ్డి రామకృష్ణనాయకులు, వివిధ జిల్లాల మిర్చి రైతులు పాల్గొన్నారు.

## ఈ నెల 30 లోపు ముందస్తు ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

**నగర కమిషనర్ పులి శ్రీనివాసులు**

**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :**

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొత్తం ఆస్తి పన్నును ఏప్రిల్ నెలాఖరులోపు చెల్లించే వారికి మొత్తం పన్నుపై 5 శాతం రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి పన్నుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపిందని, 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆస్తి పన్నును ఏప్రిల్ 30 నాటికి చెల్లించిన వారికి ఆస్తి పన్నులో 5% రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం జిఓ.ఆర్టీ నం.267 జారీ చేసిందన్నారు. 2025-26 డిమాండ్ ని మున్సిపల్ శాఖ ఆన్ లైన్ అప్ లోడ్ చేస్తున్నందున,ఈ నెల 7వ తేదీ నుండి 5శాతం రాయితీని వినియోగించుకోవచ్చాన్నారు. కావున ఆస్తి, ఖాళీ స్థల పన్నుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకొని ఈ నెలాఖరు లోపు ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందాలని కోరారు.

## గత ప్రభుత్వంలో పట్టించుకున్న వారు లేరు

- లోకేష్ హామీ ఇచ్చిన విధంగానే రోడ్లు నిర్మించి, ఇళ్ల పట్టాలు అందించారు.
- ఆయన, ఆయన కుటుంబం చల్లగా ఉండాలి
- మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమంలో ఓ వృద్ధురాలి భావోద్వేగం
- నడవలేకపోతున్న వృద్ధురాలి వద్దకు స్వయంగా వెళ్లి ఇంటి పట్టా అందించిన మంత్రి లోకేష్



మంగళగిరి మేజర్ న్యూస్ : మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమంలో మంగళగిరి రత్నాలచెరువుకు చెందిన అడిగొప్పల మల్లీశ్వరి అనే వృద్ధురాలు భావోద్వేగానికి గురయ్యారు. దాదాపు పదేళ్ల నుంచి మంగళగిరి రత్నాల చెరువులో నివాసం ఉంటున్నాం. రహదారి సౌకర్యం, తాగునీరు లేక ఇబ్బందులు పడ్డాం. అద్దె ఇళ్లలో జీవనం సాగించాం. ఎన్నికల సమయంలో రోడ్లు నిర్మిస్తామని, పట్టాలు ఇస్తామని లోకేష్ గారు హామీ ఇచ్చారు. అన్నట్లుగానే రోడ్లు వేశారు, పట్టాలిచ్చారు. ఇబ్బందుల్లో ఉన్న మాలాంటి వారికి అండగా నిలిచిన ఆయన, ఆయన కుటుంబం చల్లగా ఉండాలి. ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నందుకు మాకు చాలా సంతోషంగా ఉంది. గత ప్రభుత్వంలో ఇళ్లలోకి నీరు వచ్చినా పట్టించుకున్న వారు లేరు. రత్నాలచెరువులో నివాసం ఉంటున్న వారికి లోకేష్ చేసిన సాయం మరువలేనిదంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ఇంటి పట్టా అందుకునేందుకు స్టేజి వద్దకు వచ్చిన వృద్ధురాలు నడవలేకపోవడంతో స్వయంగా మంత్రి లోకేష్.. మహిళ వద్దకు వెళ్లి ఇంటి పట్టా అందించారు. కన్నీటిపర్యంతమైన మహిళను ఓదార్చి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

## సమాచార హక్కు చట్టం2005పై అవగాహన సదస్సు



పెదకాకాని మేజర్ న్యూస్ :- మండల పరిధిలోని నంబూరు గ్రామంలో శుక్రవారం మండల వ్యవసాయాధికారి పి. సంధ్యారాణి ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన సదస్సు నిర్వహించారు. పౌర సరఫరాలాధికారికి దరఖాస్తు అందిన 30 రోజులలో కోరిన సమాచారాన్ని అధికారులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నంబూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఐగ్రో పాఠశాలలో గ్రాడ్యూయేషన్ డే

**నరసరావుపేట మేజర్ న్యూస్**

ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పల్లబోతుల వెంకట్ మాట్లాడుతూ చిన్నారులు ప్రీ ప్రైమరీ లోనే చదువు పై ఉత్సాహాన్ని చూపించారని వారికి శిక్షణ ఇచ్చిన తల్లీ దండ్రులకు,ఉపాధ్యాయులకు పేరు పేరు నా అభినందనలు తెలియజేశారు. అలాగే 5 వ తేది శనివారం సాయంత్రం 5.30 గంటలకు తమ పాఠశాలలో ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ళ రాఘవేంద్ర రావు హైదరాబాద్ వారిచే పేరెంట్స్ కు అవగాహన సదస్సు ఉంటుందని,పిల్లలు సెల్ ఫోన్ కు ఎడిట్ కాకుండా ఉండాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎలాంటి అంశాలు పాటించాలి, విద్యార్థుల యొక్క మానసిక స్థితి ఎలా గమనించాలి, పిల్లలతో ఎలా మెలగాలి ఇంకా అనేక అంశాలపై అవగాహన కార్యక్రమం ఉంటుందని, ఈ ప్రోగ్రాం లో అందరూ ఆహ్వానితులే నని పాఠశాల చైర్మన్ పల్లబోతుల వెంకట్ తెలియజేశారు.



# ఇళ్ల పట్టాల పంపిణీ తొలి అడుగు మాత్రమే

**అన్ని రంగాల్లో మంగళగిరిని దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దుతాం**

**ఇళ్ల పట్టాల కోసం గతంలో జిరాక్స్ లకే వేల రూపాయలు వెచ్చించిన పరిస్థితి**

**అయినా ఎవరూ న్యాయం చేయలేదు, నేడు రూపాయి అవినీతి లేకుండా పట్టాల పంపిణీ**

**మంగళగిరి ప్రజలు పెట్టిన బాధ్యతను నా భుజస్కంధాలపై మోస్తున్నా**

**ఇచ్చిన హామీ నిలబెట్టుకునేందుకే ఈ రోజు మీ ముందుకు వచ్చా**

**నీరుకొండలో 99, మంగళగిరి రత్నాలచెరువుకు చెందిన 199 కుటుంబాలకు శాశ్వత ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన మంత్రి నారా లోకేష్**



మంగళగిరి మేజర్ న్యూస్: ఇళ్ల పట్టాల పంపిణీ తొలి అడుగు మాత్రమే అని, అన్ని రంగాల్లో మంగళగిరిని దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దుతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మన ఇల్లు-మన లోకేష్.. పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం మంగళగిరి డాన్ బాస్కో ఉన్నత పాఠశాల పక్కన ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సభలో నీరుకొండ గ్రామం, మంగళగిరి రత్నాలచెరువుకు చెందిన పేద కుటుంబాలకు శాశ్వత ఇళ్ల పట్టాలను మంత్రి లోకేష్ బట్టలు పెట్టి స్వయంగా అందజేశారు. దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న నీరుకొండకు చెందిన 99 మంది, మంగళగిరి రత్నాలచెరువుకు చెందిన 199 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది. 2019లో మంగళగిరిలో పోటీచేయాలనే ఐడియా వచ్చింది. నాకు పరిచయం లేని నియోజకవర్గం ఇది. 21 రోజుల ముందు నాకు టికెట్ ఇచ్చారు. నేనేంటో మీకు తెలియదు, మీ సమస్యలేంటో నాకు అర్థం కాలేదు. 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయా. దాంతో కసి పెరిగింది. ఓడిపోయిన రెండో రోజు నుంచే కష్టపడి మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకోవాలని ఆనాడే నిశ్చయించుకున్నాను. ప్రతిపక్షంలో ఉన్న ఐదేళ్లు మీకోసమే అహర్నిశలు కష్టపడ్డా. 26 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేప్టటాం. ఎన్టీఆర్ సంజీవని పెట్టి ఉచితంగా వైద్యం అందించాం. ఇంట్లో పెళ్లి జరిగితే బట్టలు పెట్టాం. నీటి సమస్య ఉంటే వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు అందించాం. నైపుణ్య శిక్షణ అందించి యువతకు ఉద్యోగాలు కల్పించాం. సొంత నిధులతో మంగళగిరి ప్రీమియర్ లీగ్ ను ఏర్పాటుచేసి క్రికెట్ ను ప్రోత్సహించాం. వర్షాకాలంలో గ్రామాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోతే గ్రావెల్ ను, డస్ట్ ను అందించాం.

**మంగళగిరి ప్రజలు చరిత్ర తిరగరాశారు**

2024 ఎన్నికల సందర్భంగా రచ్చబండ నిర్వహించి ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకున్నా. దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వారికి శాశ్వత ఇంటి పట్టాలు అందించాలని ఆనాడు ప్రజలు నన్ను కోరారు. మేం నివసిస్తున్న ఇళ్లకే పట్టాలు ఇవ్వాలని కోరారు. దూరంగా ఇస్తే పనులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడతామని చెప్పారు. 53వేల మెజార్టీతో నన్ను గెలిపించాలని అప్పుడు కోరా. ఎన్నికల సమయంలో సర్వేలు చేస్తారు. ఆ సర్వేల్లో కుప్పం, మంగళగిరిని చూస్తే.. మన మెజార్టీ తక్కువగా కనపడేది. నేను చంద్రబాబు గారితో పోటీ పడేందుకు ప్రయత్నిస్తా. ఇంత చేసినా తక్కువ మెజార్టీ ఏంటని అనుకున్నాం. ఎన్నికల తర్వాత కుటుంబ సభ్యులం బయట దేశానికి వెళ్లాం. అప్పుడు కుప్పం కంటే ఒక్క ఓటైనా నాకు ఎక్కువగా వస్తుందని బాబుగారితో చెప్పా. కుర్రోళ్లు స్పీడ్ కాబట్టి.. అంత సీన్ లేదన్నారు. మంగళగిరి ప్రజలు చరిత్ర తిరగరాశారు. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా మంగళగిరిలో నాకు భారీ మెజార్టీ కట్టబెట్టి శాసనసభకు పంపారు.



**మంగళగిరి ప్రజలు పెట్టిన బాధ్యతను భుజస్కంధాలపై మోస్తున్నా**

మంగళగిరి ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించడంతో నాపై బాధ్యత పెరిగింది. ఇంటి పట్టాలు ఒకరోజుతో అయ్యేపని కాదు. సులభంగా జరిగేవాటికి కొంతమందికి మొదటి ఏడాదిలోనే పట్టాలు ఇస్తామని చెప్పా. కొంతమందికి రెండేళ్లు, మూడేళ్లు పట్టవచ్చని ఆనాడే చెప్పా. గౌరవంగా బట్టలు పెట్టి, పసుపు, కుంకుమతో పట్టాలు ఇస్తానని చెప్పా. 3వేలు పట్టాలు ఇచ్చేందుకు 6 రోజులు పడుతోంది. ఇచ్చిన హామీ నిలబెట్టుకునేందుకే ఈ రోజు లోకేష్ మీ ముందుకు వచ్చాడు. మీరు ఏ బాధ్యత అయితే నాపై పెట్టారో ఆ బాధ్యతను నా భుజస్కంధాలపై మోస్తున్నా. మీరు ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే అంత బలమొస్తుందని ఆనాడే చెప్పా. అప్పుడే బాబుగారితో, పవనన్నతో పోరాడి నిధులు తెచ్చేందుకు బలమొస్తుందని చెప్పా. ఈ రోజు నాకు ఆ బలం, శక్తి ఇచ్చారు. అందుకే కేబినెట్ లో మంగళగిరికి వంద పడకల ఆసుపత్రి గురించి అడిగితే ఎవరూ కాదనలేదు.

**ఇళ్ల పట్టాల పంపిణీ తొలి అడుగు మాత్రమే**

**అన్ని రంగాల్లో మంగళగిరిని దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దుతాం**

పార్క్ లు, చెరువులు అభివృద్ధి చేస్తున్నాం. కల్యాణ మండపాలు కడుతున్నాం. డ్రైనేజీకి శాశ్వత పరిష్కారం కోసం భూగర్భ డ్రైనేజీ, నీరు, భూగర్భ గ్యాస్ అందిస్తాం. భూగర్భ కరెంట్ కూడా అందిస్తాం. మీరు పవిత్రమైన కార్యక్రమం కోసం వచ్చారు. దశాబ్దాలుగా అనేకమందికి శాశ్వత పట్టాల కోసం విజ్ఞాపనలు అందించారు. జిరాక్స్ ల కోసమే వేల రూపాయలు ఖర్చుపెట్టారు. ఎవరూ న్యాయం చేయలేదు. వేదికపై ఉన్న జనసేన, బీజేపీ, తెలుగుదేశం కలిసికట్టుగా మీ ఇంటికి వచ్చి కచ్చితమైన కొలతలు తీశారు. మీ వద్ద నుంచి టీ కూడా తాగకుండా పారదర్శకంగా పట్టాలు అందజేస్తున్నాం. 3వేల కుటుంబాలకు వెయ్యి కోట్ల రూపాయల విలువైన పట్టాలు ఎన్డీయే ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. ఇది తొలి అడుగు మాత్రమే. చరిత్ర రాసేందుకు వచ్చా. మీ అందరి ఆశీస్సులతో అన్ని రంగాల్లో మంగళగిరిని దేశంలోనే నెం.1గా తీర్చిదిద్దుతాం.

**స్వచ్ఛ భారత్ లో మంగళగిరిని నెం.1గా చేయడమే నా లక్ష్యం**

స్వచ్ఛ మంగళగిరి కోసం అధికారులు బాగా కష్టపడుతున్నారు. పూడిక, చెత్తను తొలగిస్తున్నారు. 30 రోజుల్లో వెయ్యిటన్నుల చెత్త బయటపడింది. స్వచ్ఛ భారత్ లో మంగళగిరిని నెం.1గా చేయడమే నా లక్ష్యం. అధికారులు, ప్రజాప్రతినిధులుగా మేము కష్టపడతాం. ప్రతిరోజు చెత్త ఎత్తే కార్యక్రమం తీసుకుంటాం. పారిశుద్ధ్య కార్మికులు బాగా కష్టపడుతున్నారు. దయచేసి తిరిగి చెత్తవేయవద్దని కోరుతున్నా. చెత్తను రోడ్లపై వేయకుండా డస్ట్ బిన్ లలో వేయాలని కోరుతున్నా. సంవత్సరం ఓపిక పడతా. ప్రజల్లో చైతన్యం తీసుకువస్తా. రెండో ఏడాది కర్ర పట్టుకుని తిరుగుతా. ఎవరి ఇంటి ముందైనా చెత్త కనపడితే మిమ్మల్నే నిలదీస్తా. ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. మనలో కూడా మార్పు రావాలి. నాపై పెద్ద బాధ్యత పెట్టారు. ఎన్నో ఆశలతో నన్ను గెలిపించారు. మొదటి పది నెలల్లోనే శాశ్వత పట్టాలు అందిస్తున్నాం. సూపర్ సిక్స్ హామీలు, నేను వ్యక్తిగతంగా ఇచ్చిన హామీలు నెరవేరుస్తా. వంద పడకల ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయిలో నిర్మిస్తాం. అందుకు మీ అందరి సహకారాలు కావాలి. నేను ఎక్కడికి వెళ్లినా మంగళగిరి నా గుండెల్లో ఉంటుందని చెప్పారు.

## కూలీలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే మక్కిన

**వినుకొండ మేజర్ న్యూస్ :**

వినుకొండ మండలం ఉమ్మడివరం గ్రామ SC కాలనీ వాసులు కూలీ పనుల నిమిత్తం ఏనుగుపాలెం వెళ్తుండగా మార్గ మధ్యలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా 13మంది గాయపడ్డారు గాయపడిన క్షతగాత్రులను వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మరియు ఉమ్మడివరం సర్పంచ్ వీరగంధం ఆనంద్,మండల తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు పరామర్శించారు..



## సచివాలయ వ్యవస్థను బలహీనం చేస్తున్నారు

- షేక్ అబ్దుల్ రజాక్



పిడుగురాళ్ల మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ లో గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా.. ఆ దిశగా చర్యలు మాత్రం కొరబడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 15వేల గ్రామ, వార్డు సచివాలయాలను ఐదేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సచివాలయాల్లో దాదాపు 1,30,000 మందికి పైగా శాశ్వత ఉద్యోగులు ఉన్నారు. వారి శ్రమను దోపిడీ చేస్తూ సచివాలయ వ్యవస్థని బలహీనం చేస్తున్నారని గ్రామ అవార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్రంలోని పదివేల మందికి పైగా సచివాలయ ఉద్యోగులను డిప్యూటేషన్ పై ప్రజాప్రతినిధుల వద్ద, ప్రభుత్వ కార్యాలయాల్లో, వివిధ శాఖల్లో నిర్మించారని తెలిపారు. సచివాలయ ఉద్యోగులకు సర్వీసు రూల్స్ వర్తింపజేసి పదోన్నతలు కల్పించాలని అబ్దుల్ రజాక్ కోరారు.

## అనాధలకు ఆహార ప్యాకెట్ ల పంపిణీ

**తాడేపల్లి,మేజర్ న్యూస్:**

మంగళగిరి –తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధి యర్రబాలెం కు చెందిన గ్రంధి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో శుక్రవారం సీతానగరం ప్రకాశం బ్యారేజ్ వద్ద అనాథలకు ఆహార ప్యాకెట్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు గ్రంధి వెంకట లక్ష్మీ పద్మావతి మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా అనాథలకు ఆహార పొట్లాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు దానబోయిన హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పది మూల్యాంకన ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట మేజర్ న్యూస్ :

శుక్రవారం పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీ పి. అరుణ్ బాబు స్థానిక నరసరావుపేట లోని శ్రీమతి కాసు రాఘవమ్మ బ్రహ్మానంద రెడ్డి( రెడ్డి కాలేజ్) కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకన ప్రక్రియను పరిశీలించారు.పరీక్ష పత్రాలను భద్రపరిచిన గదిని పరిశీలించి ఎంత శాతం మూల్యాంకన జరిగింది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫస్ట్ ఎయిడ్ ఏర్పాట్లను పరిశీలించి మూల్యాంకన సిబ్బందికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మూల్యాంకన ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాల నేపథ్యంలో వృద్ధుడి హత్య

**మామ ను హత్య చేసిన అల్లుడి కుటుంబ సభ్యులు**

మాచర్ల ప్రతినిధి/విజయపురిసౌత్ న్యూస్: కుటుంబ కలహాల నేపథ్యంలో పండ్ల హరిచంద్ర (60) అనే వృద్ధుడు ను ఆయన కుటుంబ సభ్యులే హత్య చేసిన సంఘటన మాచర్ల మండలం కొత్తూరు గ్రామం వద్ద చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే గత నాలుగు నెలల క్రితం పండ్ల హరిచంద్ర తన అల్లుడు బెజవాడ రమేష్ ను గొడ్డలితో నరికాడు.తలకు తీవ్ర గాయం అవడం తో బెజవాడ రమేష్ అప్పటినుంచి కోమాలోకి వెళ్ళిపోయి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.అనంతరం హరిచంద్ర తెలంగాణా వెళ్ళిపోయి అక్కడే నివాసం ఉంటున్నాడు.కుమారుడు బెజవాడ రమేష్ 4 నెలలుగా కోమాలో ఉండటం తో ఆయన తల్లి కొటేశ్వరమ్మ తన కుటుంబ సభ్యులతో కలిసి హరిచంద్ర ను హత్య చేసేందుకు పథకం పన్నారు.ఈ నెల 2 న తెలంగాణా ప్రాంతంలోని హిల్ కాలనీ ప్రాంతంలో పండ్ల హరిచంద్ర ను కిడ్నాప్ చేసి హత్య చేశారు.అనంతరం డెడ్ బాడీని మాచర్ల మండలం కొత్తూరు సమీపంలోని చిన్ని శ్రీను అనే రైతు పొలాల్లో పడేసారు.పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పల్నాడు జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ గా డాక్టర్ సురేష్ కుమార్

**నరసరావుపేట మేజర్ న్యూస్:**

నరసరావుపేట లోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ గా డాక్టర్ ఎన్ సురేష్ కుమార్ శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈయన నేత్ర వైద్య నిపుణులుగా పనిచేస్తూ సూపరిండెంట్‌గా నియమితులయ్యారు . ఇప్పటివరకు ఇక్కడ ఇన్చార్జి సూపరిండెంట్‌గా, మరియు పల్నాడు జిల్లా ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షణ (డీసీహెచ్ఎస్) ఇంఛార్జి అధికారిగా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ బీవీ రంగారావు గుంటూరు జిల్లా డీసీహెచ్ఎస్ గా బదిలీ అయ్యారు.

## కెఎల్ యులో ఘనంగా అంతర్జాతీయ మహిళా సమ్మిట్

**తాడేపల్లి, మేజర్ న్యూస్:**



వడ్డేశ్వరం కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా సమ్మిట్ కెఎల్ ఉమెన్ డెవలప్మెంట్ సెల్ అద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పలువురు మహిళా మణులతో కలిసి ప్రో చాన్సలర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విబాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్ లు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా సమ్మిట్ చైర్ పర్సన్ డాక్టర్ రూత్ రమ్య మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరగాలన్నారు. వేడుకలలో బాగంగా పలు రకాల టెక్నికల్,నాన్ టెక్నికల్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం కార్యదర్శి కోనేరు శివకాంచనలత, కెఎల్ ఇఎఫ్ బోర్డు సభ్యులు కోనేరు నిఖిల, దివ్య, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రో చాన్సలర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు, ప్రో వి.సి. డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, చైర్ పర్సన్స్ డాక్టర్ రూత్ రమ్య, డాక్టర్ ఐ.గోవర్ధిని, డాక్టర్ సిహెచ్. శ్రీకావ్య, కన్వీనర్లు డాక్టర్ కె.సోని,డాక్టర్ హరిత, డాక్టర్ ఎ.ప్రియా, డాక్టర్ పి.లక్ష్మిప్రసన్న, డాక్టర్ వి.సైలజ, డాక్టర్ పి.రాజరాజేశ్వరి, డాక్టర్ శాంతిశ్రీ, డాక్టర్ కోనేరు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిష్ట మహొత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కన్నా



సత్తెనపల్లి మేజర్ న్యూస్: మండలం దూళిపాళ్ళ గ్రామంలో సీతారాముల నూతన శిలాబింబగణపతి ఆంజనేయ స్వామి ప్రతిష్ట మహొత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారిని దర్శించుకున్నరు. అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. పూజా కార్యక్రమంలో వేలాదిగా గ్రామస్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో వివిధ హొదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవాలయాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

**మేడికొండూరు సిఐ నాగూర్ మీరా సాహెబ్**

మేడికొండూరు, మేజర్ న్యూస్: మండల పరిధిలోని అన్ని గ్రామాల దేవాలయాల కమిటీ వారు తప్పనిసరిగా దేవాలయ ఆవరణలో, వెలుపల తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మేడికొండూరు సిఐ నాగూర్ మీరా సాహెబ్ అన్నారు. మండల పరిధిలోని మేడికొండూరు పోలీస్ స్టేషన్ నందు శుక్రవారం దేవాలయాల పూజారులు కమిటీ వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నాగుల్ మీరా సాహెబ్ మాట్లాడుతూ మండల పరిధిలో దొంగతనాలు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని,అందులో భాగంగా మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో పూజారులు కమిటీ వారు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్లు,పూజారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు నకరికల్లులో ఉచిత మెగా వైద్య శిబిరం

సత్తెనపల్లి మేజర్ న్యూస్: గజ్జల నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో వాసవి కళ్యాణ మండపం నందు జరుగుతుందన్నారు.జిబిఆర్ హాస్పిటల్ నరసరావుపేట వారి వైద్య బృందంచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సుధీర్ భార్గవ్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా మాచర్ల మాజీ శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతారన్నారు.వైద్య శిబిరం ఈ ఉచిత వైద్య శిబిరంలో ఎముకలు, కీళు ,, గుండె, థైరాయిడ్,నెమ్ము, బిపి, షుగరు, ఆయాసం, కళ్ళు తిరుగుట, వాంతులు, వ్యాధులకు తగిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తామన్నారు.

## విద్యాలయ సంస్థ ప్రతినిధులతో సమీక్ష సమావేశం

**నరసరావుపేట మేజర్ న్యూస్:**

శుక్రవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో రెవిన్యూ అధికారులు మరియు కేంద్రీయ విద్యాలయ సంస్థ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్లలో అనువైన ప్రదేశాన్ని గుర్తించి తక్షణమే తరగతులు నిర్వహించేలా ఏర్పాటు చేయాలని సంబంధిత రెవెన్యూ అధికారికి సూచించారు. ఈ సందర్భంగా మాచర్ల రెవెన్యూ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ మాచర్ల లోని పిడబ్ల్యుడి కాలనీ, మరియు జిల్లా పరిషత్ బాయ్స్ పాఠశాలలో రూములు కేటాయించదానికి అనువుగా ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. అదేవిధంగా పిడబ్ల్యుడి కాలనీలో 5 ఎకరాల స్థలాన్ని గుర్తించడం జరిగిందని తెలిపారు. కేంద్రీయ విద్యాలయ అధికారులతో క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా రొంపిచర్లలో మంజూరైన కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు గుర్తించిన స్థలాన్ని రీ వెరిఫై చేయాలనీ సంబంధిత మండల రెవెన్యూ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో గురజాల రెవిన్యూ డివిజన్ అధికారిమురళీ కృష్ణ, నరసరావుపేట రెవిన్యూ డివిజనల్ అధికారి మధులత, రొంపిచర్ల మండల రెవెన్యూ అధికారి నిర్మల ,కేంద్రీయ విద్యా లయాల డిప్యూటీ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు,

## నరసరావుపేట పట్టణంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే డా.చదలవాడ



**నరసరావుపేట మేజర్ న్యూస్ :**

నరసరావుపేట పట్టణంలో శానిటేషన్ డ్రైవ్ లో భాగంగా శుక్రవారం నరసరావుపేట ఎమ్మెల్యే డా"చదలవాడ అరవింద బాబు స్థానిక 25 వ వార్డు పెద్దచెరువు లో పర్యటించారు సైడ్ కాలువలలో పూడికను తీశారు సైడ్ కాలువల వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు గడ్డిని తొలగించారు స్థానికులతో వార్డు లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు రాష్టంలో మరియు నియోజకవర్గం పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమలను వివరించారు సమస్యల పరిష్కారనికి అధికారులతో చర్చించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా"చదలవాడ మాట్లాడుతూ నరసరావుపేట పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా మార్చడమే తన లక్ష్యమని ప్రతి రోజు వార్డు వార్డు నా తిరుగుతూ మున్సిపాల్ కార్మికులను పార్టీ కార్యకర్తలను వెంట తీసుకొని కాలువలను రోడ్లను మరియు ప్రజల సమస్యలను పరిష్కారం చేసే విధంగా చర్యలు చేపడ్తున్నట్టు తెలియజేసారు ఈ కార్యక్రమంలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారుబి

## కార్మికుల పట్ల నిర్లక్ష్య వైఖరి తగదు

**శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివ కుమారి**



**నరసరావుపేట మేజర్ న్యూస్:**

పరిసరాలను శుభ్రం చేసి ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడుతున్న మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు అధికారుల నిర్లక్ష్యం తగదని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి శివకుమారి అన్నారు. సమాన పనికి సమాన వేతనం పని చేసిన అన్ని దినాలకు వేతనాలు సక్రమంగా ఇవ్వాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం 16వ రోజు చేరాయి. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ కార్మికుల పేర్లు ఆప్కాస్ లో ఉన్నప్పటికీ సగం రోజులకే వేతనాలు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు.చేసిన పనికి సరైన వేతనం ఇవ్వకుంటే కార్మికులు ఎలా బతకాలని సమాన పనికి సమాన వేతనం రూ 21 వేలు ఇవ్వాలన్నారు. ఆరేళ్లుగా పని చేస్తున్న 40 మంది కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయడంలో తాత్సారం తగదన్నారు. ఔట్సోర్సింగ్ కార్మికులతో పాటు వీరి పేర్లు ఏపి ఔట్సోర్సింగ్ కార్పొరేషన్లో నమోదైనా వివక్ష ఎందుకని ప్రశ్నించారు. పట్టణీకరణ పెరిగిన నేపథ్యంలో కార్మికుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా ఇంచార్జ మంత్రి జోక్యం చేసుకొని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.నిరసన దీక్షలో నరసింహారావు, జె.శ్రీను, వై. ఇంద్రయ్య, కె. మరియదాసు, కె.దేవదానం, సమాధానం, నాగరాణి, జె. వీరయ్య, జి.చందు, జి.చిట్టిబాబు, యు.రాజు, ఎ. లతా, వి.నాగమణి, పి. కోటేశ్వరరావు, జె. ప్రేమ్ కుమార్, షేక్ ఖాదర్ వలి, జి.రాంబాబు, సెల్వి, జగన్నాథం, సాల్మన్ పాల్గొన్నారు.

## రైలు కిందపడి వ్యక్తి మృతి

పిడుగురాళ్ల మేజర్ న్యూస్ : పిడుగురాళ్ల పట్టణంలోని జానపాడు రోడ్డు రైల్వే గేటు సమీపంలో ఈరోజు రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఈ విషయం స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించగా పట్నంలోని జానపాడు రోడ్డు లో ఉన్న రైల్వే గేటు వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 50 సంవత్సరాలు వరకు ఉంటుందని సమాచారం. రేపల్లె సికింద్రాబాద్ ఎక్స్ ప్రెస్ రైలు కిందపడి వ్యక్తి మృతి చెందాడని తెలిసినవారు స్థానిక పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని పోలీసు వారు తెలిపారు.

## వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై వైసీపీ డబుల్ గేమ్

### ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, మేజర్ న్యూస్ : "వైసీపీ ఎప్పుడు ఏ పని చేసినా దానిలో నిజాయితీ, నిబద్దత రెండూ ఉండవు. ఇప్పుడు వక్ఫ్ పేరుతో వైసీపీ చేస్తున్న రాజకీయాలు కూడా అటువంటివే. పార్లమెంట్ సాక్షిగా ముస్లింలకు వైసీపీ నేత జగన్మోహన్‌రెడ్డి మరోసారి దోకా ఇచ్చారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు నిన్నటి వరకు కబుర్లు చెప్పిన వైసీపీ నేతలు... ఇప్పుడు మద్దతుగా రాజ్యసభలో కేంద్రానికి అనుకూలంగా వైసీపీ ఎంపీలు ఓటు వేశారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై వైసీపీ డబుల్ స్టాండ్ ప్రదర్శించడంతో... ముస్లిం సమాజంపై వైసీపీ మోసపూరిత విధానం బయటపడింది." అని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మాట తప్పడం మడమ తిప్పడం జగన్ పేటెంట్. ఇది జగమెరిగిన సత్యం. పార్లమెంట్ సాక్షిగా ముస్లింలకు జగన్ ద్రోహం చేశాడు. ముస్లిం సమాజానికి సంబంధించిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై వైసీపీ పార్లమెంట్ సాక్షిగా డబుల్ గేమ్ ఆడింది. ఈ విషయం పార్లమెంట్ సాక్షిగా మరోసారి బట్టబయలైంది. ముస్లింల ఓట్లు ఎక్కడ పోతాయే అనే భయంతో లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లుకి వైసీపీ వ్యతిరేకం అని తన ఎంపీల చేత చెప్పించిన జగన్... రాజ్యసభకు వచ్చేసరికి అనుకూలంగా ఓటు వేయించారు. ఓటింగ్ అయిపోయిన తర్వాత పార్టీ నుంచి విప్ జారీ చేయించారు. పార్లమెంట్ చరిత్రలో ఇప్పటివరకు ఓటింగ్ అయిన తర్వాత విప్ జారీ చేసిన సంఘటనలు గానీ, జారీ చేసిన పార్టీలు గానీ లేవు. జగన్ సూచనలతో రాజ్యసభలో వైసీపీ ఎంపీలు వక్ఫ్ బిల్లుకు మద్దతుగా ఓటు వేశారు. ఎన్డీయే ప్రభుత్వానికి లోక్ సభలో పూర్తి మెజారిటీ ఉంది. జగన్ ఏ స్టాండ్ తీసుకున్నాడో ఆ స్టాండ్‌కి రాజ్యసభలో కట్టుబడి ఉండాలి. కానీ ఇక్కడ ఆయన కప్పదాటు వ్యవహారం చేశాడు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై వైసీపీ స్టాండ్ ఏంటి అనేది స్పష్టంగా చెప్పే ధైర్యం కూడా చేయలేదు. లోక్‌సభలో విప్ జారీ చేసి... రాజ్యసభలో ఎందుకు వదిలేశారో జగన్‌రెడ్డి సమాధానం చెప్పాలి. ఇది ముస్లింలను మళ్లీ మోసం చేయడం కాదా? ఇది వెన్నుపోటు రాజకీయం కాదా? ముస్లింల విషయంలో ఇంతటి మోసానికి తెగబడిన వైసీపీని ముస్లిం సమాజం క్షమించదు.' అని మోహనకృష్ణ పేర్కొన్నారు.

## నరసరావుపేటలో కేంద్ర వైద్య బృందం పర్యటన



నరసరావుపేట మేజర్ న్యూస్ : నరసరావుపేట పట్టణంలో జరిగిన బర్డ్ ఫ్లూ మరణం పై శుక్రవారం ఐదుగురు సభ్యులతో కూడిన కేంద్ర వైద్య బృందం సంఘటనా స్థలమును పరిశీలించారు. వీరు ఎయిమ్స్ మంగళగిరి హాస్పటల్ నందు ఈ పాపకు సంబంధించిన అన్ని రికార్డులను అన్ని రికార్డులను పరిశీలించారు. వీరితోపాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మల్లేశ్వరి, స్టేట్ ఎపిడమిక్ విభాగం వారు ఈ బృందంతో పాటు ఉన్నారు. వీరు సంఘటనా స్థలమును పరిశీలించి కుటుంబ సభ్యులతో మాట్లాడి తగిన సమాచారంను తెలుసుకున్నారు. తదుపరి పరిసరాలను పరిశీలించారు. చికెన్ షాప్ కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.


విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

అక్షరానికి నైతికతను అద్ది దేశవ్యాప్తంగా 23 ఎడిషన్లతో సామాజిక న్యాయం వైపు ముక్కుంచే యజ్ఞం "నేటి దినపత్రిక సూర్య" చేపట్టింది. అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ యజ్ఞంలో "నేటి దినపత్రిక సూర్య" అక్షర సైనికులను మరి కొంత మందిని నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు, గుంటూరు జిల్లాలలో ఖాళీగా ఉన్న మండలాలకు విలేకరులను నియమించుకోదలచినాము. కావలెను. ఆసక్తిగల వారు ఈ క్రింది మండలాలకు ఈ నెల 31వ తేదీలోగా ఇంటర్వ్యూకి ఈ క్రింది అడ్రస్సులో సంప్రదించగలరు.

1.తాడికొండ, 2. తుళ్ళూరు, 3. మేడికొండూరు, 4. ఫిరంగిపురం, 5. ప్రత్తిపాడు, 6. పెదనందిపాడు, 7. కాకుమాను, 8.వట్టిచెరుకూరు, 9.అమరావతి, 10.గుంటూరు రూరల్, 11.గుంటూరు జిల్లాపరిషత్, 12. దాచేపల్లి, 13. బొల్లాపల్లి, 14. పెదకూరపాడు, 15. పొన్నూరు

పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777

జిల్లా ఇన్‌చార్జిలు : జి.శ్రీనివాసరావు సెల్ : 9959426987 · ఆర్.డి.నాయక్ సెల్ : 8897455466

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ కార్యాలయం, 9/1, అరండల్‌పేట, గుంటూరు.


# ఆలపాటి శివరామకృష్ణయ్య స్పెషల్ కవర్ విడుదల



గుంటూరు, మేజర్ న్యూస్ : ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ట్రస్ట్ పదవ వార్షికోత్సవం సందర్భంగా ఆయన చేసిన దేశ సేవలకు గుర్తుగా ఇండియా పోస్టల్ డిపార్ట్మెంట్ 2025 పోస్టల్ స్పెషల్ కవర్ని శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన కుమారుడు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన తండ్రి చేసిన సేవలను గుర్తు చేసుకొని జీవితంలో ఎలా ఉండాలో తన తండ్రి దగ్గర నుంచి నేర్చుకున్నానని చెప్పారు. ఆయన స్ఫూర్తితోనే రాజేంద్రప్రసాద్ రాజకీయాల్లో నిస్వార్థంగా సేవ చేస్తున్నారు అలాగే మరొక ముఖ్య అతిథి డీఎల్ కాంతారావు ఆలపాటి శివరామకృష్ణయ్య సేవలు నర్సాపేట కొనియాడారు. ఈ సభకు తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ యు ఎలమందయ్య స్పెషల్ కవర్ రిలీజ్ ప్రాముఖ్యతను వివరించారు తక్కువ టైం ఉన్నా గాని ఈ కవర్ రిలీజ్ కు తన వంతు సహాయం చేశారు. సభకు అధ్యక్షత వహించిన పోస్ట్మాస్టర్ ఈ. నాగేశ్వరరావు స్పెషల్ కవర్ రిలీజ్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు డివిజన్ ఐపి రవిశంకర్ మార్కెటింగ్ ఎగ్జిట్ ఫణీంద్ర ఏఎస్పీ పొంచ జన్య రెడ్డి తెనాలి ఆఫీసు ఓఎస్ సుధాకర్ తెనాలి వెంకటస్వామి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎం శివయ్య పవన్ పిఏ సాంబశివరావు ఎక్స్ పి ఆర్ ఐ పి తస్నీరు శ్రీనివాస్ బాబు డివిజన్ ఆఫీస్ సిబ్బంది తెనాలి హెచ్ ఓ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# ముస్లింల మనోభావాలను గౌరవించాలి

- వక్ఫ్ బోర్డు బిల్లు విషయంలో వైసీపీది ద్వంద్వ వైఖరి
- గుంటూరు ముస్లిం వైసీపీ నేత తీరు దారుణం
- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

వక్ఫ్ బిల్లుకు మద్దతు విషయంలో వైసీపీది ద్వంద్వ వైఖరి అని, లోక్‌సభలో వ్యతిరేకించి, రాజ్యసభలో అనుకూలంగా ఓటేశారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ మండిపడ్డారు. ఇదంతా జగన్ సూచనతోనే జరిగిందన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లు మద్దతు విషయంలో వైసీపీ వైఖరిని ఖండిస్తూ శుక్రవారం ఎమ్మెల్యే నసీర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యసభలో మద్దతుపై జగన్ నిజస్వరూపం మైనార్టీలకు అర్థమైందని చెప్పారు. వైసీపీ వెన్నుపోటు రాజకీయాలను చూసి ముస్లింలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. ముస్లిం మత ఆచారాలను తమ స్వార్థం కోసం పాతిపెట్టిన వైసీపీ



గుంటూరు జిల్లా మైనారిటీ నాయకురాలు ముస్లింల గురించి మాట్లాడటం, వారిని సామాజిక మాధ్యమాల ద్వారా రెచ్చగొట్టే ప్రయత్నం వారి నీచ స్వభావానికి నిదర్శనమని చెప్పారు. వక్ఫ్ సవరణ బిల్లులోని కొన్ని అంశాలను టీడీపీ వ్యతిరేకించి, జాయింట్ పార్లమెంట్ యాక్షన్ కమిటీ లకి ప్రస్తావించటమే కాకుండా, నిర్మొహమాటంగా పార్లమెంట్ లో తెలుగుదేశం పార్లమెంట్ సభ్యులు మాట్లాడారని, దానిపై చంద్రబాబు తన స్పష్టమైన వైఖరి తెలిపారని చెప్పారు. ముస్లిం సమాజం మనోభావాలను గౌరవించటంతోనే ఏ పార్టీ అయినా భారతదేశంలో మనుగడ సాధ్యమని పేర్కొన్నారు.

# యాప్‌లు మా వల్ల కాదు మహా ప్రభో...! అంగన్‌వాడీల ఆవేదన

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో




తాజాగా ప్రవేశపెట్టిన పలు యాప్‌లు తమకు ఇచ్చిన మొబైల్ ఫోన్‌లలో ఇన్‌స్టాల్ కాక నరక యాతన పడుతున్నామని, సాంకేతిక సమస్యలు పరిష్కరించకుండా యాప్‌ల ద్వారానే సరుకులు పంపిణీ చేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం పట్ల అంగన్‌వాడీ వర్కర్లు ఆవేదన, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పోషణ ట్రాకర్, ఎఫ్ఆర్ఎస్, యాప్ ద్వారా లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేస్తున్నారు. లబ్ధిదారుల ఫొటో క్యాప్చర్ చేసి సరుకులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఫోన్‌లో సాంకేతిక సమస్య తలెత్తినా, నెట్‌వర్క్ లేకపోయినా లబ్ధిదారు ఫొటో క్యాప్చర్ కాక సరుకులు ఇవ్వడానికి వీలు పడటం లేదన్నారు. తమకు ఇచ్చిన ఫోన్‌లలో కొన్ని యాప్‌లు ఇన్‌స్టాల్ కావడం లేదని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించకుండా తాజాగా బాల సంజీవని 2.0 వెర్షన్‌తో కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చిందన్నారు. ఈ యాప్‌లో వర్కర్, హెల్పర్, ఫొటో క్యాప్చర్ చేసి లబ్ధిదారు గర్భిణి, బాలింత, 7–3 వయసు కలిగిన, అలాగే 3–6 సంవత్సరాలు వయసు కలిగిన పిల్లల ఫొటోలు కూడా క్యాప్చర్ చేసి బాలసంజీవని పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే పలు సాంకేతిక సమస్యలతో పోషకాహారం పంపిణీకి నానా ఇబ్బందులు పడుతున్న తమపై కొత్త యాప్‌లు తీసుకువచ్చి ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరుకుల పంపిణీ అంతా ఆన్‌లైన్ విధానంలోనే చేయాల్సి ఉంటుంది. ఒక పనికి 3 యాప్‌లలో అప్లోడ్ చేయాల్సి వస్తోంది. యాప్‌లతో ఇబ్బంది పడుతూనే ప్రీ స్కూలు విద్యార్థులకు బోధన, పోషకాహారం తయారు చేసి పెట్టడం వంటి విధులు నిర్వహించాల్సి వస్తుందన్నారు. ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు పిల్లల బరువును పరిశీలించాలని, రికార్డ్స్ రాయడం, టేక్ హెూమ్ రేషన్ పంపిణీ, యాప్‌ల ద్వారా ప్రభుత్వం కోరిన సమాచారం ఇవ్వడం వంటి విధులు నిర్వహిస్తున్నామని, పెన్షన్ల పంపిణీ కార్యక్రమం కూడా తమపైనే రుద్దుతున్నారని అలానే హెల్పర్లు కేంద్రాన్ని శుభ్రం చేయడం, పోషకాహారాన్ని వండి పెట్టడం, గిన్నెలు శుభ్రం చేయడం, పిల్లల వాష్‌రూములు శుభ్రపరచడం వంటి పనులు చేస్తున్నారని, వీరికి కేవలం రూ. 7వేలు వేతనం మాత్రమే ఇస్తున్నారనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా పనిభారంతో ఒత్తిడికి గురవుతున్న వర్కర్లకు రూ. 11,500 మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు చేసే పని తమతో చేయిస్తున్నప్పటికీ వేతనాలు మాత్రం సమానంగా ఇవ్వడం లేదని వర్కర్లు వాపోతున్నారు. బాలసంజీవని యాప్‌ను సవరణ చేయాలని, సమాన వేతనాలు అమలు చేయాలని, పనిభారం తగ్గించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కొత్త టెక్నాలజీతో కూడిన మొబైల్ ఫోన్లు అందజేయాలనీ కోరుతున్నారు.

## ఐసీఎంఆర్ బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

నరసరావుపేట మేజర్ న్యూస్ : నరసరావుపేటలో బర్డ్ ఫ్లూ వైరస్ ( హెచ్5ఎన్ 1) లక్షణాలతో ఇటీవల బాలిక మృతి చెందిన ఘటనపై అధ్యయనం కోసం రాష్ట్రానికి వచ్చిన ఐసీఎంఆర్(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. నరసరావుపేటలో పర్యటన అనంతరం తనను కలిసిన ఐసీఎంఆర్ బృందంతో బాలిక మృతికి గల కారణాలను చర్చించారు. బాలిక నుంచి సేకరించిన నమూనాలలో హెచ్5ఎన్1 లక్షణాలు బయటపడినప్పటికీ, ఇతర అనారోగ్య కారణాలు బాలిక మృతి చెందడానికి దారితీశాయని బృందం సభ్యులు చెప్పారు. ఉడికించని మాంసం తినడం, చిన్నారి కావడంతో వ్యాధి నిరోధకశక్తి లేకపోవడం, లెప్టోస్పిరోసిస్(ఎలుకల విసర్జన వల్ల వ్యాపించే వ్యాధి), అపరిశుభ్ర వాతావరణం కూడా మృతికి కారణాలుగా తమ అధ్యయనంలో తేలిందన్నారు. ప్రస్తుతం ఆ పరిసర ప్రాంతంలో ఎలాంటి బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని, 8 బృందాలతో సర్వే చేపట్టామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. చిన్నారి కుటుంబ సభ్యులతో పాటు... బంధువులు, స్థానికుల నమూనాలు పరీక్షించామని... ఎవరికీ బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని చెప్పారు. దీనిపై ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి కేసులు నమోదుకాకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో యాంటీవైరల్ డ్రగ్స్ సిద్ధం చేశామని అధికారులు తెలిపారు.